The Chintamani.

A MONTHLY TELUGU MAGAZINE

Vol.5.] RAJAHMUNDRY: MAY & JUNE, 1896 [Nos. 11,12.

CONTENTS.

RAJAHMUNDRY:

Printed and published for the Proprietor by K. SeshagiriRao at the Vivekavardhani Press.

1896.

విషయసూచిక.

THE CHINTAMANI. చింతామణి

RATES OF SUBSCRIPTION (*inclusive of Postage.*)

For one year (*in advance*) ... Rs. 3-0-0
Single copy. ... 0-4-6

For *bonafide* students and village school masters, the annual subscription, if paid in advance, is Rs2-6-0 only. In case the subscription is not paid within a month after the commencement of the year, it will be collected by V. P. P.

ADVERTISEMENT RATES.

One page annually.	Rs.25-0-0.	One page half yearly.	15-0-0
Half page ,, ,,	15-0-0.	Half page. ,,	10-0-0

One line single insertion. ... ... 0-?-0.

☞ Apply to the Manager, Chintamani, Rajahmundry

చందానిర్ణయము. (అంచెకూలితోకూడ.)

సంవత్సరమునకు (ముందుగాచెల్లించిన) రు 3-0-0. విడిప్రతియొకటికి 0-4-6.

విద్యార్థులకును పల్లెటూరి యుపాధ్యాయులకును సంవత్సరమునకు ముందుగా పంపినయెడల చందా రెండురూపాయల ఆఱణాలుమాత్రమే. చందా సంవత్సరము ప్రారంభమయిన మాసములోపల పంపనిపక్షమున, తరువాతి సంచికను వాల్యూపేయబిలుగాపంపి సొమ్మువసూలుచేయఁబడును. వలయువారు రాజమహేంద్రవరములో చింతామణిమేనేజరుగారికి వ్రాసికొనవలయును.

శ్రీ

చింతామణి.

ఇదిమాసమునకొకసారి ప్రకటింపఁబడును.

రాజమహేంద్రవరము.

సంపుటము ౫.] దుర్ముఖి సంవత్సర వైశాఖ, జ్యేష్ఠ మాసములు. [సంచిక. ౧౧.౧౨.

సంస్కరణము.

లక్ష్మీనారాయణ విలాపములోని ద్వితీయరంగమునందలి రెండవ పద్యములో "భార్య" యని యున్న దానిని 'దార' యని చదువుకోవలెను.

కృతివిమర్శనము.

సతీమణి:— యను పద్యకావ్యము వైజయంతి పత్రికాధిపతులగు మ-రా-శ్రీ రాయబహాదర్ పసప్పాకము అనంతాచార్యవర్య తనయులగు శ్రీనివాసాచార్యులు బి-ఏ- గారిచే రచింపఁబడినది. ఈకథ ఆంగ్లేయభాషలో 'కాంబెల్' అను కవీశ్వరుఁడు వ్రాసిన "ఓకానర్స్ చైల్డు" అను కావ్యమునందలి కథ ననుసరించి వ్రాయఁబడినది. ఆంగ్లేయకథ ననుసరించి వ్రాయుటలో నూతన మార్గము నవలంబించినట్లు గ్రంథకర్తగారు పీఠికయందు వ్రాసియున్నారు. కాంబెల్ గారు వారి యుద్యానవనములో 'నమరంథ్' (amaranthus caudatus) అను పుష్పవిశేషమును చూచి ఈకథను కల్పించెను. ఈపుష్పమెప్పుడును వాడిపోనందున 'ప్రేమశోకము' అని వాడఁబడును. కథానాయకురాలగు శ్రీభామపురాధీశ్వరుని పుత్రిక తాను మోహించిన పురుషునితో గృహము విడిచిపోయి విపినభూములందు స్వేచ్ఛగా విహరించుచుండఁగా నామె సోదరులువచ్చి యామె మనోనాయకుఁడు కులహీనుఁడని వానిని యుద్ధరంగంబునఁ బరిమార్చి పాతిపెట్టిరి. అతని సమాధిపైని 'అమరాంథ్' అను పుష్పము బయలువెడలఁగా దానిని ప్రతిదినము తన కన్నీటఁ దడుపుచు నామె యా సమాధియొద్దనే కాలము గడపుచుండఁగా నొక పాంథుఁ డామెను చూచి

యోహా చరిత్రను తెలిసికొనెను. ఆమె యిచ్చిన శాపముచే నామె సోదరులు రాజ్యభ్రష్టులై యడవులపాలయినట్లును, వారి రాజ్యము శత్రుసేనలపాలయినట్లును కూడ వ్రాయఁబడియున్నది. తుదకామె ప్రాణత్యాగముఁ జేసినట్లు శ్రీనివాసాచార్యులుగారి గ్రంథమందు వ్రాయఁబడియున్నదికాని మూల గ్రంథమునం దామె జీవించియున్నట్లు వ్రాయఁబడియున్నది. గ్రంథకర్తగారి శైలి మృదువై మధురముగానున్నది. గ్రంథాదియం దిష్టదైవప్రార్థనయు, తమ తండ్రిగారి ప్రశంసయుఁజేసి గురువరేణ్యులకు నమస్కరించి, గ్రంథము పార్థసారధిస్వామి కంకిత మొనర్చిరి. గ్రంథకర్తగారి శైలి నుదాహరించుటకై కొన్ని పద్యముల నీక్రిందఁ బొందుపఱచుచున్నాము.

చ. కర మలరారు నీదుపురి గౌరవ మొప్పఁబడంతులెల్ల నీ
సరసపుఁబల్కులన్ వినుచుఁ జంచలనేత్ర విలాస సంజ్ఞలన్
దెరపుచు సర్వకార్యముల నిన్నటుచుట్టుచు నిల్చువారలో
తరుణిరో! నేఁడిదేల మదిఁ దల్లడమందఁ గతంబుఁ దెల్పవే.

చ. సరసిజనేత్ర! కన్గవలజారెడు నశ్రులఁ జిమ్మవమ్మ, యీ
విరియిటువాడు వాఱఁగను వేఁడిగ నూర్పులఁ బుచ్చకమ్మ, యీ
కరణి వనాంతరంబున వగన్గనుఁ గుందకుమమ్మ నెంజెలిన్
బొరలుచు నీదు దేహలత పొల్పును వీడకుమమ్మ వేఁడెదన్.

తే. అయ్యనాయశ్రుధారల నకట పెరిఁగెఁ
దీఁగె యియ్యదివిరి యిది దీనఁబుట్టెఁ
దలఁపఁ దలఁపంగ హృదయము తాపమొందు
నెట్టు లీలతాంతము కథ నెఱుకపఱుతు.

ఉ. కాంచనగంధి కాంచన వికారములైన సముజ్జ్వలప్రభో
దంచిత భూషణాళి రుచి యద్భుతకాంతుల నీనఁబ్రక్కలన్
సంచిత విక్రమాభ్యుదయ శౌర్యనిధుల్ భటులేపుమీఱఁగన్
మించు నృపోత్తముణ్గవయు మేలగు నీకును మూకఁ జూడఁగన్.

ఉ. వాని మనోజ్ఞ భాషణము, వాని వినోదకథావిశేషముల్
వాని సుధీబలంబకట వాని మనోహర సచ్చరిత్రముల్
వాని ముఖేందు కాంతులును వాని వికాసపుఁ గౌఁగిలింతలున్
నే నెటుగాంతు నింక గరుణింపరె దేవతలార నాపయిన్.

వలయువారు గ్రంథకర్తగారికి వ్రాసి గ్రంథములఁ బడయవచ్చును. వెల ౩ అణాలు.

శ్రీ కాళహస్తి మాహాత్మ్యము.

ధూర్జటికవి ప్రణీతంబగు నీ గ్రంథము నూతనముగా నచ్చొత్తింపఁబడి ప్రకటింపఁబడినది. మ-రా-రా-శ్రీ ర- వేంకట సుబ్బయ్య బి. ఏ గారును, కొ- వెంకట పద్మనాభశాస్త్రిగారును ఈ గ్రంథమును 'నునుపుచేమించు దళసరి కాగితములపైఁ జక్కఁగ నచ్చొత్తించిరి' పండితులచే నీ గ్రంథము సమ్యక్పరిష్కృతంబగుటచేఁ దప్పులు గానరావు. పద్యంబులెల్ల పాదమున కొకపఙ్క్తియు యతిస్థానములం గుర్తును గలిగి యుండును 'శ్రీ జ్ఞానప్రసూనమాలిక' యను పేరఁ బ్రకటింపఁబడు గ్రంథరాజిలో నిది మొదటిది. శ్రీ జ్ఞానప్రసూనమాలికా ప్రథమసూనమగు నీ కాళహస్తి మాహాత్మ్యమునందలి కథ మిక్కిలి మనోహరముగా నుండును. శ్రీ యను సాలెపురుగును, కాళమను సర్పమును, హస్తియను నీశ్వరునిఁ గొలిచి సాయుజ్యము నొందిన స్థలమునకు 'శ్రీ కాళహస్తి' యనియు, చంద్రాలంకారునకు శ్రీ కాళహస్తీశ్వరుఁడనియు నామములు కలిగెను.

శా. గౌరీశుండు చెలందిఁ బాముగజముల్ కైవల్య సామ్రాజ్య ల
క్ష్మీరూపంబగు తన్నుఁ గూర్చుకొనఁగా శ్రీకాళహస్తీశ్వరుం। డైరాజిల్లె' నని

గ్రంథకర్త చెప్పియున్నాఁడు.

ఈ గ్రంథమునందు కన్నడపు పదములు పెక్కులు కానిపించుచున్నవి. ధూర్జటి శివభక్తుఁడు. ఈయన కవనము రసవంతమై మృదువైయుండును. పాకము ద్రాక్షాపాకము. ఈ కవీశ్వరుని శైలి యీ క్రిందిపద్యములవలనఁ దేటపడఁగలదు.

శా. కాంచెన్గాంచన పంకజాత విలసద్గంధాంధ సారంగ ఫే
నాంచత్తుంగతరంగవారినిధి సీతాగాంతరాభంగ రో
మాంచస్వేద జలాశ్రుపూర జనకాత్మానంద సంపన్నో
మంచాగ్రస్థిత విశ్వనాథపదసమ్యక్సంగ గంగానదిన్. తృతీయాశ్వాసము.

చ. తిమిర దినేంద్రజాజలముఁ దెచ్చి యజాండ ఘటంబునందుఁ బో
సి మరలఁ బశ్చిమాశయను చెల్వవహించిన పద్మరాగ కుం
భముగతి సూర్యుఁడుం జనియెఁ బ్రాక్సతి వెన్నెలవెల్లు వేటి తో
యము వడిఁబోయు హేమ కలశాకృతిఁ జంద్రుఁడుసొప్పె నయ్యెడన్.

చ॥ అ॥

సుందరి.

చెన్నపట్టణములో నూతనముగా బయలుపెడలుచున్న 'సుందరి' యను మాసపత్రిక యొక్క మొదటిసంచిక మాకందినది. ఈ పత్రికాయుద్దేశములఁగూర్చి ప్రకటనలో 'అందు నానావిషయములు చేటు తెలుగుమాటల వెలివేయఁబడును. ఇప్పుడిది చిన్నదిగానున్నదని తలఁచకుఁడు. అందరభిమానింతురేని క్రొత్తక్రొత్తవి మిక్కుటముగ మాసికలోఁ జేర్పఁగలమని యూరకొననేల' యని పత్రికాధిపతులు వ్రాసియున్నారు. మాకందిన సంచికలో "మహా సందేహము" లని కొన్ని యంశములు వ్రాయఁబడినవి. వీనిని ప్రకటించుటయందు పత్రికాధిపతి యుద్దేశమేమో మే మూహింపఁజాలకున్నాము. ఇట్టివిషయములఁ బ్రచురించినచో 'సుందరి' కళావిహీనయై చూచుటకైన నసహ్యాకారముగానుండును. కాఁబట్టి 'సుందరి' యభివృద్ధిని గోరు పత్రికాధిపతులు సర్వజనోపయోగమైన విషయముల బ్రచురించి ఈ నవీన సుందరిని బ్రకాశింపఁజేయుదురుగాత!

ప్రబంధకల్పవల్లి.

ఇది శ్రీ రాజయోగి పత్రికకు పశాఖగా మ-రా-రా-శ్రీ గురజాడ శ్రీరామమూర్తి పంతులవారిచే క్రిందటి నెలనుండి ప్రచురింపఁబడుచున్నది. 'ఇట్లుండఁ బయిసంపుటికకెంత పనిచేయుచున్నను నింకను బ్రచురము కావలసిన పెక్కు పురాతన గ్రంథము లుండుటచేతను వాని నాంధ్రలోకము మిక్కిలి కాంక్షించుచుండుటచేతను వానిలో గొన్ని మాకడనుండుటచే బయి సంపుటికలకు సాయ్యంబుగ మా ప్రబంధకల్పవల్లిని గూడ మరల లేవదీసి చేత నయినంత యాంధ్రలోకంబున కుపకారం బొనర్చుట ప్రముఖకార్యంబని యెంచినారము.' అని పత్రికాధిపతులు వ్రాసియున్నారు. ఈసంచికయందు మాఘమాహాత్మ్యని చరిత్రంబును, పాతంజల యోగశాస్త్రమును నంది మల్లయ్య ఘంట సింగయామాత్య కవి విరచితమైన ప్రబోధచంద్రోదయమును, నవీన వచన ప్రబంధ మొకటియుఁ బ్రకటింపఁబడినవి. వీరి యుద్యమములు నిర్విఘ్నములుగాఁ గొనసాగుగాత!

శ్రీ గజపతిరాయనింగారి యుపన్యాసము.

దుర్ముఖి సంవత్సరాదిని శ్రీ రాజా గోడే నారాయణ గజపతిరాయనింగారు C. I. E. వారి మహలులో జరిగించిన సంకీర్తనానంతరమందు చేసిన యుపన్యాసము మా కార్యస్థానము నలంకరించినది. ఇందులో శ్రీ రాజాగారు వివిధమతములనుగూర్చి యుపన్యసించిరి. వానిలో ముఖ్యముగా హిందూమతమును గురించి భగవద్గీతలు మొదలగు గ్రంథములనుండి యుదాహరణములతో నుపన్యసించి తరువాత యెహూదీ మతము, పారసీకమతము, బౌద్ధమతము, జైనమతము, చీనామతము, కిరస్తాన్మతము, మహమ్మదీయమతమునుగూర్చి కొంత యుపన్యసించి అన్నిమతములును భగవంతుని యారాధనను గురించియును, యుక్తప్రవర్తనగా తిరుగగలందులకును చెప్పుచున్నట్లు విశదీకరించిరి. శ్రీ రాజాగారి పరోపకార పారీణతయు, బుద్ధి కౌశల్యతయు నందఱకు విశదమయ్యెయున్నది. సర్వేశ్వరుఁడు శ్రీ రాజాగారికి చిరాయువొసఁగి దేశక్షేమాభివృద్ధికై పాటుపడువారి ప్రయత్నములను నిర్విఘ్నములుగా కొనసాగించుగావుత!

A. S.

అంతఃపురోపన్యాసము.

(గయ్యాళియగు భార్య తన భర్తకు రాత్రులు పాన్పుపైఁ జేసిన యుపన్యాసములు.)

ఏమి నాథా! మీరింత యాలస్యముఁ జేసితిరి. ప్రొద్దుపోనేలేదా?

అవును, పోలేదు. అంతే. ప్రొద్దుపోవడమేమో ఆడుదాని కేమితెలియును. మంగళవారమునాఁడు మీ రాలస్యముగా వచ్చినారు. అదివరకు శుక్రవారమునాఁడు కొంచె మాలస్యమయినది. అంతకు పూర్వము బుధవారమునాఁడు—మీ రాప్రకారము పక్కమీఁద దొర్లడమెందుకు—నేను మిమ్మున యేమీఅనడము లేదు. నేనుఅని నప్పటికి యేమిలాభము. అవును. మీరు ప్రొద్దుపోయినదాక నింటికి రాకపోయినయెడల నా కొకప్పుడు కోపమువచ్చేది. ఇప్పుడన్ననో, అది మీ తప్పిదమే. నన్ను నెపపెట్టు నక్కఱ లేదు. మీరింటికివచ్చినను రాకపోయిననుసరే, మీరే నన్నిట్టిస్థితికిఁ దెచ్చినారు. మిమ్మునగూర్చి నేనింత యలక్ష్యముచేయవలసివచ్చునని నేనెప్పుడనుకొనలేదు. కాని అది మీరే చేసినారు. మీ రిరువది సంవత్సరములనుండి త్రొక్కుచున్న పురుగు మీకిప్పు డెదురుతిరిగినది.

ఇప్పుడు మీతో నేను పోరాడను. మీ కెట్లుపోయినను సరే. నేను మిమ్ము నడుగదలంచినది— మరెవరైనను పక్కలోనున్న భార్యతో ముచ్చటింతురు. మీవలె ముద్దులాడున పురుషుండెవరు— మంగళవారమునాడు మీ రెక్కడికి వెళ్లినారో చెప్పండి? మా తల్లికి దేహములో రుగ్మతగానున్నను అక్కడకుఁ బోలేను. ఆమె యాస్తి యంతయు మన పిల్లలకే చెందచేయవలెనని చెప్పుచున్నది. నా బంధువులయెడల మీకెప్పుడు అనిష్టము. పోనీ క్లబ్బుకు వెళ్లినారేమో అంటే అక్కడకును వెళ్ళలేదు. నేనెరుగుదును. నాటకములకు వెళ్లలేదు.

వేసెల్లెరుగుదునా?

ఆహా! అవును. నాకు తెలియక పోవలసినదే పైనచెప్పిన స్థలములలో నెక్కడకు మీరు పోలేదు. మీరు వెళ్లినచోటు నేనెరుగుదును.

అయితే నన్ను తిరిగి అడుగుటెందుకు?

మీ దొంగతనము బయలఁబెట్టి మీరు నన్ను మోసముచేయలేరని తెలియఁ జేయుటకు 'తుదకబ్బెరా తురకభాష' యని నట్లు చివరకు మీరు 'బిలియర్డ్సు' ఆడుచున్నారా? ఒక్కపర్యాయమేనా?

చాలు చాలు. మీరు వేయిసారు లాడవచ్చును. నేను తప్పుచేసి 'ఒక్కసారే కాదా' అని నప్పుడు మీ కెట్లుండునో? అవును మగవా రేమిచేసినను తప్పులేదు.

మీకిది యంత్యదశయే!

దారాపుత్రాదులను మఱచి తెల్లవారువఱకు గెడకఱ్ఱలతో దంతపు బంతులను పచ్చగుడ్డమీఁద కొంటుచు ప్రపంచజ్ఞానమువదలి మీయిష్టమువచ్చినట్లు తిరుగవచ్చును. ఈ బంతులాటవలని ప్రయోజనమేమో నాకుఁ దెలియకున్నది.

గృహమునందలి సౌఖ్యములవిడిచి ప్రతిదినము బంతులాటకుఁబోయి మీసంసారమును చెడగొట్టుకొనవచ్చును. ప్రతిదినము పదియాటలోడిపోయినయెడల అయిదు రూపాయి లిచ్చుకొనవలెను. నెలకు నూటయేబది రూపాయిలు. సంవత్సరము నాఁటికి సంసారమంతయు గుల్లయైపోవును. తరువాత మీ బ్రతుకు తెరవెట్లు? లక్షల కొలది సంపాదించి పెద్దపేరులు పెట్టుకొనినవారు ప్రతిదినము ఆడవచ్చును. 'పులిని చూచి నక్క వాతపెట్టుకొని' నట్లు వారినిచూచి మీరుకూడ చెడిపోవుచున్నారు. నక్కయెక్కడ? నాకలోకమెక్కడ? మీసంపాదన చూడబోతే నెలకు రెండువందలైనా లేదు. ఇట్టి స్థితిలో మీ సంపాదన యావత్తూ 'బిలియర్డ్సు' కే పెట్టి మీరు పకీరులగుదురా యేమి? చాలు చాలు. నాలుగుడాళ్లు తెచ్చుకుని పొట్టపోసికొనుచు మర్యాదగా కాలక్షేపముచేయక మీకెందు కిట్టి యవస్థ?

దేహమున కారోగ్యమా?

ఏమి ఆరోగ్యము! మన్ను ఆరోగ్యము! గెడకఱ్ఱలవంటి కఱ్ఱలు చేతులలోఁ బట్టుకొని బల్లచుట్టు తిరుగుట దేహమున కారోగ్యమా! రెండుఝాము లొక్కటీరున నిలబడినయెడల నడుమునొప్పి యెత్తును. కాళ్లు లాగును. ఇంటికి వచ్చువరకు తలనొప్పి, జ్వరమువచ్చును. అప్పుడు డాక్టరు కావలెను. డాక్టరు కిచ్చుటకు డబ్బెక్కడిది. ఉన్నదంతా బిలియర్డ్సుకే చాలకుండె? తూటకట్టులవలె మీసములు పెంచుకుని చేయుపనిలేక సోమరిపోతులై తిరుగువారలతో మీవంటివారు తఱుచు సాంగత్యము చేసినయెడల మీ మర్యాద నిలుచునా?

ఆటగాండ్రందరు మర్యాదహీనులా యని మీరడుగుచున్నారా? పదిడబ్బు లుంటేసరి. వారేమిపని జేసినను బాగుండును. మీరున్ను రెండులక్షలు సంపాదించిన తరువాత ప్రతిదినము బిలియర్డ్సు ఆడవచ్చును. నిన్నగాక మొన్న కన్నులు విప్పి నాలుగు డబ్బులైన చేతులోలేని మీవంటివారాడితే మీపని యేమికావలెను.

నాకు పట్టుమని పదిపుంజీల నగలైనా లేవు. ఎక్కడకైనా పేరంటానికి వెళ్ళడమునకు సిగ్గగుచున్నది. ఇవన్నీ మీకెందుకు? మీ బిలియర్డ్సుకు దినమునకొక యర్ధరూపాయి ఉండినచాలు. ఇంటిదగ్గర పస్తున్నాసరే?

మీరీ యుద్యోగములోఁ బ్రవేశించినతరువాత నాకొక మంచి జరీకోకైనా కొని పెట్టినారా? చూడండి మీతోకూడ పనిలో ప్రవేశించినవారెట్లున్నారో? మొన్ననే కాదా. వాళ్ళ సీతాయిమగడు పునహానుంచి యాభై రూపాయిల పట్టుచీరతీసికొని వచ్చినాడు. మీరేమితెచ్చినారు. చేతులాడించుకుంటూవచ్చినారు.

వెంకాయి మగడు పట్నమునుంచి మొన్ననేకాదూ కట్టు అడ్డబాస తీసికొని వచ్చినాఁడు. నాకొక మంచి అడ్డబాసయినా లేదు. పదిరూపాయిలకు మంచి ముక్కుముంగర వచ్చును. ముక్కుముంగరలకు, ముత్యములకు మీకు డబ్బెక్కడ? ఎంతడబ్బు బిలియర్డ్సుకేచాలదు.

నగలెందుకు దొంగలెత్తుకొనిపోవుటకా

అవునవును. ముక్కులో ముత్యమైనలేక బోసిదానివలె నుండవలెనుకాఁబోలు. ఆహా! యేమి యీ నవనాగరికుల యభిప్రాయములు! మీ డబ్బంతయు బిలియర్డ్సు దేవతపాలు చేయుటకంటె దొంగలపాలైనను మంచిదే!

నిన్నకాక మొన్ననేకాదా డబ్బుపెట్టి చీట్లాడినందుకు రెండురాత్రులు వరుసగా చీవాట్లు పెట్టితిని జ్ఞాపకములేదా? ఈ బిలియర్డ్సుకంటె చీట్లాటే మంచిది

అందులో గెలిచినయెడల ప్రతిదినము నాలుగుడబ్బులైనా వచ్చును. రెండుదినములు కూరకు వెతకికొన నక్కరలేదు.

ఈ బిలియర్డ్సులో మీరు గెలిచినమాత్రమున లాభమేమి! ఓడినవానిడబ్బు మీకేమైన వచ్చునా?

ఇప్పుడేమన్నను లాభములేదు. మీ కుటుంబ నాశనము నిశ్చయము. బిలియర్డ్సు గదిలోఁ బ్రవేశించినవా రెవ్వరును బాగుపడలేరు. మా పినతండ్రి 'బిలియర్డ్సు' ఆరంభించినతరువాత నొకమాసమైనను మా పినతల్లితో కాపురము చేయలేదు.

అదృష్టవంతుఁడా?

అవును. భార్యను వదలిపెట్టినవాఁడు అదృష్టవంతుడే! నాపని యేమికావలెను? మనము కలిసియుండు దినములు సరిపోయినవి. ఇంతకాలమునుండి కలిసియున్నందుకు మన మిప్పుడు వేరుపడవలసివచ్చినది.

నే నెరుగుదును. మీకట్టిస్నేహితులు దొరికినప్పుడు మీపని యేమి కావలసినది. ఒక్కపర్యాయమే ఆడినానని చెప్పినందువలన లాభమేమి! త్వరలోనే ఆట బాగుగ నేర్చుకొని యింటికి రావడమే మానివేయుదురు. తరువాత మిమ్ముల ఆనవాలు పట్టుటయే కష్టము. ముఖముచూచినతోడనే బిలియర్డ్సు ఆడువాడని నేను చెప్పగలను. మీరుకూడ మీసములు దట్టముగా పెంచి దొంగచూపులు చూచుచుందురు. ఆరు మాసములనాఁటికి మీముఖచర్య యావత్తు మారిపోవును. మీపిల్లలే మిమ్ముల ఆనవాలు పట్టలేరు.

మీ రేపనిఁజేసినను సరేకాని బిలియర్డ్సు ఆడితేమాత్రము నేను సహించను. ఆట గాండ్రను మీయొద్ద బదుళ్లు మొదలుపెట్టెదరు. దానితో దరిద్రముకూడ సంభవించును.

ఆహా! ఏమి ఆ బంతులమహిమ! అవి బంతులుకావు! సంసారములఁబగలఁగొట్టు రాతిగుండ్లు దరిద్రదేవత యాయుధములు!

ఇంక నాకు సౌఖ్య మెక్కడిది. మీదృష్టి ప్రతిదినము పచ్చగుడ్డమీఁదనే యుండును.

మీరు బిలియర్డ్సు ఆడుచున్నారు. ఇఁక మానరు. ఏమి నా దురదృష్టము. నే నెంత మందభాగ్యురాలనైతిని! హా! దైవమా! ఇంక నాగతియేమి!

ఈప్రకారము భార్య యుపన్యసించుచుండఁగా భర్త నిద్రపోవుటచే నామె యుపన్యాసము పూర్తిగా మనకు దొరకలేదు.

A. S.

క. గణుతింపఁగ మరుశంఖము । మణిదీప్తికినై తపస్సమాధినిలిచి యా
మణిదీప్తి పెంపుయుతరుణీ । మణికంఠంబై సువర్ణమహిమందనరెన్. ౫౯.

క. పగడంపుఁ దియ్యమోవికిఁ । బగడంబుగఁ దాల్చి కెంపు బాగులచే నా
ని గెలువనొదవమినో యీ । చిగురాకులఁబోలు నింతి చేకట్లువడెన్. ౬౦.

క. హల్లకగంధికి మదనుఁడు । పల్లవరాగంపు ముద్దపై సమ్మృతముఁ బోఁ
జల్లుచు నధరముఁ జేసెను । పల్లవరాగంబుగాఁగఁ బ్రతిభాస్ఫూర్తిన్. ౬౧.

గీ. పండువెన్నెలఁగాయు నీ పడఁతిమోము । నంటఁ గెమ్మోవి తనరె సుధాశస్త్ర
చయము సుధఁద్రోలఁగాఁబూని చంద్రునందు । మించుఁగెంపులగిండిఁగీలించెననఁగ.

క. ఈపడఁతి మెఱుఁగుఁజెక్కులు । చూపట్టెన్ రతియు భావజుండును దమలో
నేపున నలరుచుఁ జిహ్నము । లాపోవఁగఁజూచు మెఱుఁగు టద్దములనఁగన్. ౬౩.

క. రమణికి నాసిక తనరెను । గమలానందనుఁడు పాంథగణపక్షిసమూ
హముఁ బడనూఁదఁగఁ దిలసూ । నము గావించు జమిలినాళము రీతిన్. ౬౪.

గీ. మించు బవిరెల కెంపులు మేలువాలుఁ । గన్నుఁగవకొల్కులకు వింత కాంతినొసఁగ
వెలఁది ముత్యాలకమ్మలకళలు గండ । ఫలకములనిండ నింతిపీనులు దనర్చె. ౬౫.

గీ. పెల్లడామరతేకుల విరియఁబోలి । వాలుగలనెల్ల నాకవంక పలలఁబెట్టి
చికిలిచేసిన యలుఁగులఁ గిసరుపఱచి । కామినికి నొప్పె నీవాలుఁ గన్నుదోయి.

ఉ. వమ్మొక యింతలేక సిడమాలిక బాగును సోగలాగునున్
గమ్మ నవీనకాంతి గతిఁ గ్రమ్మఁగఁజేసి దివానిశంబులున్
నెమ్మి లతాంతసాయకుఁడు నిక్కముగా సవరించు వింటికిన్
న్బొమ్మలఁ బెట్టునట్టు కనుబొమ్మలు చూడఁగ నొప్పె బాపురే. ౬౬.

చ. కమలుజుఁ డీవధూటి యలికంబటుచూచి మునిద్రుమప్రసూ
నము నొనరించి పోలదని నవ్వుచుఁ జెట్లనుగట్టి క్రొన్నెలం
గ్రమమునఁ జేసిన స్సవతురామికి రోసి నమోదురాజునుం
దమకముతోడ నాకసమున న్విడిఁ బాఱఁగవైచె సిగ్గునన్. ౬౭.

చ. పోలఁతి ముఖాబ్జసంపదలఁ బొందఁదలంచియొ చంద్రుఁడబ్జతన్
జెలఁగినఁ దమ్మి యబ్జతను జెందినచో సమమైన పేరికై
చలమున రెంటికిం బగనిజంబుగ నిద్ధరఁ జెల్లెఁగాక యీ
నెలపుననున్న తమ్మికిని నింగి శశాంకున కేల పోరగున్. ౬౮.

చ. తరుణి ముఖారవిందమునఁ దానకమై విలసిల్లు తుమ్మెద
ల్పరిమళలోభయుక్తిఁ దెగిపాఱకనిల్చెనొ కాక మోము చం

దురుని కళంక మీగతి వినోదముసల్పెను కాక యింతిలేఁ
గురుల మెఱుంగు చందములాకో వివరింపఁగఁ జోద్యమయ్యెడిన్. ౭౦.

ఉ. అన్నసరోజగర్భుఁ డనయంబుగ దర్శనిశన్ బ్రభాతమున్
బున్నమరే లభేదగతిఁ బొందఁగఁ జేయ మరుండు మించఁ జే
సె న్నలినాక్షి పెన్నెరులచీఁకటి ఛాయలు నిండియుండఁగాఁ
గన్నులఁ దెల్లవాఱఁగ మొగంబున వెన్నెల లుప్పతిల్లఁగన్. ౭౧.

వ. అని యివ్విధంబున నమ్మునీంద్రుం డయ్యిందువదన సకలావయవంబులం జూచిచూచి
తనివిచాలక మఱియు నిట్లని వితర్కించె. ౭౨.

సీ. కిసలయంబులమేలు కెందామరలఁగూర్చి యిచ్చోట బ్రహ్మదానేమిచేసెఁ
గదళుల సౌరును గరభంబులనుగూర్చి యిచ్చోట బ్రహ్మదా నేమిచేసె
గజకుంభములబాగు కందుకంబులఁగూర్చి యిచ్చోట బ్రహ్మదానేమిచేసెఁ
జంద్రబింబముఛాయ సరసిజంబునఁగూర్చి యిచ్చోట బ్రహ్మదానేమిచేసె
బర్హములమేలు షట్పదపంక్తిఁగూర్చి । యెలమి నిచ్చోట బ్రహ్మదానేమిచేసె
ననుచుఁ జరణోరుకుచముఖ ఘనకచముల । పసలు వీక్షించి చిత్రవిభ్రాంతినొంది.

క. కనుఁగొనెడు యోగివల్లభు । ఘనతరమైనట్టి ధైర్యకంచుకము దలం
ప నితరసాధనములచేఁ । జినుఁగునె యని మరుఁడు విరులచేఁ బగులించెన్. ౭౪.

వ. అయ్యవసరంబున నయ్యతివరుం డాత్మాధీనుండయ్యెనని తలంచి. ౭౫.

ఉ. ఆరమణీశిరోమణి నయంబున నమ్మునినాథుఁ జేరి యొ
య్యారపు గీతినిల్చి వినయంబున హస్తయుగంబుమోడ్చి క్రొ
క్కారు మెఱుంగుతోడ సహకారముఁ జేయు సువర్ణకాంతులన్
మీఱిన యట్టి చన్నుఁగవ మేలిమి కానుకగా నొసంగుచున్. ౭౬.

సీ. ప్రవహించు శృంగార రసపూర మమ్మునిమేనికి జలకంబుగా నొనర్చి
తళతళత్కాంతిచేఁ దనరెడు దరహాసచంద్రికావితతి వస్త్రముగ నొసఁగి
మవ్వంపుఁదేనియల్ చిప్పిన నిడువాక్యములు ప్రసూనములుగాఁ బూజఁజేసి
చొక్కంపు నిడువాలు చూపుమెఱుంగులు పొసఁగు నీరాజనంబులుగఁజేసి
యమృత రసములు చిప్పిలు నధరబింబ । మదన నైవేద్యమునుగ నియ్యఁగఁ దలంచి
యడుగుఁ దమ్ములకెరఁగి నెయ్యంబుతోడ । రంభ యిట్లను సంభ్రమారంభ యగుచు.

గీ. స్వర్గసౌఖ్యంబులకు నెల్ల సంయమీంద్ర । గణనఁ జేసిన నేనె కారణము సూవె
యట్లు గావున్న నాకొఱకై నరేంద్రు । లాహవంబునఁ దెగివత్తు రామదమున.

క. వినుమట్టియేను నిన్నుం । గనుఁగొని కాంక్షించియుండఁగా వేడుకఁ గై
కొని పేరతులకు ననుఁ బై । కొనవేల సుఖానుభవముఁ గొనవేలతగన్. ౭౯.

క. తనువులు నొచ్చినపిదపం । గను బ్రహ్మానందకేళికలెఁ బ్రయాసం
బునఁ జెందక పద్మాక్షీ । జనితాసంగములు మిగుల సౌఖ్యము గావే. ౮౦.

శా. నీవీ మోక్షముగోరి యోగముల నెంతేడస్సి డెందంబులో
నేవెంటం గొనరాని మీఁది యమృతంబేలా విచారింప నా
నీవీమోక్షముఁ జేసి యోగముల నెంతే నెమ్మదిం డాయ నీ
వే వెంటన్ జనకుండఁగల్గు నమృతం బిచ్చోట నామోవిపై. ౮౧.

సీ. నా గుబ్బచన్ను లున్నత హేమభూమీధ్ర శిఖరములకు నీడు సేయవచ్చు
నాజఘనంబు బృందారకానేకపశీర్షంబునకు నీడు సేయవచ్చు
నాకరంబులు సురానోకహంబులఁ బొల్చు చిగురాకులకు నీడు సేయవచ్చుఁ
నా మందహాస ముద్దాను మందాకినీతోయంబులకు నీడుసేయవచ్చు
నా యధరరుచి దేవతానాథసతత । సేవ్యసుధసొంపునకు నీడుసేయవచ్చు
గాన నాతోడి యోగంబు గల్గెనేని । దివ్యభోగంబులెల్ల సిద్ధించినట్లు. ౮౨.

వ. అని యిచ్చనచ్చలంబు హెచ్చం జేరి మీఁదఁ జలువలు గొలుపు కప్పురంపుఁ బలుకులు వోని ముద్దుఁబలుకులను వలరాజు వాఁడితూపులకు మెఱుంగుసూపు నోరచూపులను సుధారసంబు తేటలగు పాటలను మదనవిలాసంబులగు పెక్కు విలాసంబులనుం గరఁగించితినని సంతసిల్లి కరంబులు మొగిడ్చి. ౮౩.

ఉ. అమ్మునినాథు నెమ్మొగమునందుఁ గటాక్షము నిల్పి రంభ లోఁ
గ్రమ్మెడు సాహసంబు వెలిఁగానఁగవచ్చు నళీకమోహమున్
ముమ్మరమై తనర్పఁ దన మోమొక యించుక వాంచి పాద ప
ద్మమ్మున నేల వ్రాయుచు సుధారసమొల్కఁగఁ బల్కె నేర్పునన్. ౮౪.

సీ. పచ్చవిల్తునికాఁక నొచ్చిన దేహంబు నీ చల్లకౌఁగిట నిలుపకున్న
వెన్నెల మంటచే వేఁగు చన్దోయి నీ కరవారిజంబులఁ గప్పకున్న
వేఁడి నిట్టూర్పుల వెచ్చనౌమోవి నీ యధరామృతము చేత నార్పకున్నఁ
జెలులు చెప్పఁగ నైన చింతాభరంబు నీ తియ్యనిపల్కులఁ దీర్పకున్న
నెవ్విధంబున నీవలపీఁద నేర్తు । ననుచు నమ్ముని కేలంటు నతఁడు దొడ్డ
బ్రహ్మావిద్య మనంబునఁ బాముకొలిపి । దానిచేఁతకు రోసి డెందమునఁ గినిసి. ౮౫.

శా. కంఠారావమొనర్చె నత్తఱి మహోగ్రస్ఫూర్తి దిఙ్నాగముల్
గుంఠీభూతమదంబులై వడఁకఁగా గోత్రంబు లూఁగాడఁగాఁ

గంతేకాల సరోరుహప్రభవ నాకస్వామి భోగీంద్రవై
కుంఠుల్దద్దరిలంగ లోకములు సంక్షోభంబునం బొందఁగన్. ౮౬

క. భూపాలక విను తుల్యుఁడు । శాపజలం బప్పుడు కేల సవరించి మహా
కోపస్ఫురితాధరుఁడై । యాపడఁతుకఁజూచి యిట్లులనియెం బెలుచన్. ౮౭

ఉ. ఓసి దురాత్మురాల వినయోక్తులచే నను వెఱ్ఱిఁ జేయు పే
రాసలుమాను నిప్డు చెదలంటఁగనేర్చునె బల్మిఁ బైఁ బడం
గా సమకట్టి చేరితివిగానఁ దురంగమ వై చరింపు నీ
మై సొబగెల్లఁ బొల్లువడ మర్త్యునిమోచి ధరాతలంబునన్. ౮౮

వ. అని శపియించిన. ౮౯

సీ. సైంహికేయగ్రస్త చంద్రబింబమురీతి వదనంబు మిక్కిలి వాడికంద
హిమసిక్త రక్తపద్మముల చాడ్పున నశ్రువులతోడి కెంపుఁగన్నులును మొగుడ
శ్యేనత్రస్తచకోరికా నినాదంబు చొప్పున భీతి గద్గదస్వనము పొడమఁ
బెనుగాలిచేతఁ గంపించు వల్లికభంగిఁ దల్లడపాటునఁ దనువు వణఁక
నొదవు చంపక వాసన కులికిపఱచు । నళుల కైవడిఁ గుంతలంబులువిడంగ
టిచ్చపడి సొమ్మసిలియంత వెచ్చివెచ్చి । తన్నెఱుంగని పెనుమూర్ఛ ధరణిఁ ద్రాలి.

ఉ. అత్తఱిఁ గొంతసేపునకు నయ్యెలనాగ మనంబు ధీరతా
యుత్తముఁ జేసి లేచి తనువంతయుఁ గంపము నొందుచుండ రా
జోత్తము తుల్యు పాదముల కొయ్యనఁ జాఁగిలి మ్రొక్కినిల్చి లో
నత్తిన శోకము స్భయము నద్భుతముల్ బిరుసై చెలంగఁగన్. ౯౧

మ. మునిచూడామణి నీమనంబు కినుకం బొందంగ లక్ష్యంబులన్
వనజాతాక్ష లలాటలోచన సుపర్వజ్యేష్ఠ దేవేంద్రులై
నను నిల్వంగ భయంబునొందుదురన న్నాబోటి యందెవతె
ల్లను నీమ్రుందల నిల్వనోపుదురె నెల్లంబో కృపంజూడవే. ౯౨

మ. అనఘా బిచ్చుకమీఁద వేయుదురె బ్రహ్మాస్త్రంబు రౌద్రాకృతిన్
ననురోషించి తురంగరూపమున నానాదేశముల్ ద్రిమ్మరం
గ నరుల్ మోవఁగ నానతిచ్చితిరి నాకాయట్టికష్టంపు రూ
పున వర్తింపఁబడన్ భవత్కరుణచేఁ బోషించి రక్షింపవే. ౯౩

సీ. విటుఁడు పల్లార్తినఁ గటకటపడుమోవి యుసుపకళ్యములకు నాట్టులోర్చుఁ
గొనగోరు సోఁకినఁ గ్రొవ్వారు దేహంబు ఘనకశాహతుల నేగతిసహించు

వలిప పయ్యెదమోవఁ దలఁకెడి యంసంబు పక్కెరనేరీతి నిక్కి తాల్చు
నురులు పాదాంభోజ యుగళి మోవఁగనున్న యే నవ్యలవహింప నెట్లు నేర్తు
సంతతంబును గమనాలసంబులైన । నాదు పాదంబులిలఁ బవనంబులీల
పర్వఁబెట్టంగఁ జాలునె పరమయోగి । వర్య నాకిట్టి దుర్దశ వలదుమాన్పు. ౯౪.

ఉ. కూరిమితోడఁ జేరి నలకూబరు నంతటివాఁడు మత్పదాం
భోరుహలాక్ష కుంకుమము బొట్టుగఁ గైకొని యెల్లవేళలం
గారబ మెచ్చరింపఁ దన కౌఁగిటి లోపల నిద్రఁబొల్పగాఁ
గూరుకుచుండు నాకు వెడగుఱ్ఱపురూపమువచ్చె దైవమా. ౯౫.

వ. అని యివ్విధంబునఁ జింతింపుచుం దోడిచెలుల చందంబులు వీక్షింపుచు నొల్లం
బోయిన యుల్లంబున దీనయై యప్పరమ మునీంద్రు పాదారవిందంబులకుఁ బునః
పునః ప్రణామంబు లాచరించి కన్నీరు సోనగురియఁ బెదవులు దడుపుచు నతనికి
దయ పుట్టునట్లుగా వేఁడియు నిట్లని విన్నవించె. ౯౬.

గీ. ఎంత కాలంబునకు నాకు నే నెపమున । శాపమోక్షంబుగల్గెడు సజ్జనాగ్ర
గణ్య నీ నెమ్మనంబునఁ గరుణఁ జేసి । యానతీఁదగు నశ్వతఁ బూనఁజాల. ౯౭.

క. అని కరుణపుట్టఁబల్కెడు । వనితకు నా తుల్యమౌని వాత్సల్యముతో
ననియెం దరుణీ దుఃఖాం । బునఁ జెందకు వినుము శాపమోక్షక్రమమున్. ౯౮.

చ. వినయవివేకశాలి పరవీరభయంకర దోర్బలుండు కుం
డిన నగరంబునాయకుఁ డనింద్యచరిత్రుఁడు పుణ్యమూర్తి రా
మ నల భగీరథ ప్రముఖ మానవనాథ సమానరమ్య వ
ర్తనుఁడు చతుర్థుండనఁగ రాజొకఁ డుర్వరయేలుఁ గోమలీ. ౯౯.

ఉ. ఆతనికిం బురాకృత మహా సుకృతంబున మేనితోడనే
యాతత సౌఖ్యసంపదల నత్యధికంబగు పుణ్యవిష్టప
ప్రాతము చూడఁగానగును వారిజలోచన యా నృపాలునిం
బ్రీతిఁ దురంగ రూపము ధరించి వహింపుము నేర్పు మీఱఁగన్. ౧౦౦.

క. ఆనృపతికి సంతోషం । బానఁగ లోకములు చూపి యరుదెంచిన నీ
మేని చెలువంబు తొల్లిటి । పూనిక నె యుండునటుకుఁ బొమ్మని యనియెన్. ౧౦౧.

వ. ఇవ్విధంబున ననుప నంతకుమున్న యమ్మునీంద్రు కోపంబునకు బెదరి. ౧౦౨.

సీ. రతిరాజు బాణసంతతి మూలఁ బడవైచి చాపంబు గడపటఁ బాపివైచెఁ
జంద్రుఁడు తన రాక జాడఁగాదనిడోసి యుల్లంబులోఁ గంది వెల్లఁబాఱె
మలయానిలుండు సోమరియై తిననని మేని బడలికతో సుడివడి చలించె

దోరమైన యా వసంతుండు నేగెడు త్రోవఁ గానక యడవిఁ జీకాకుపడియెఁ
జిలుక గుంపులుఁ గండుఁగోయిలలగములు । నాలయఁ జాలక చెట్లనె యొదుగఁ జొచ్చె
వలుద రాయంచ గమియు వంకల నణంగె । మధుపకులమెల్లఁ దమ్ముల మఱువు సొచ్చె.

వ. ఆరంభయుఁ దన గర్వ సంరంభంబుడిగి కన్నీరు దొరుఁగ విన్నంబోయి యరవిరి దమ్మిపైఁ బరిభ్రమించు భ్రమరబృందంబు చందంబున వదనంబుపైఁ జికురంబులు వ్రేలవడి దూలఁ బుష్పాడి గప్పిన కోదమ నునుదీఁగె బాగున ధరణీపరాగంబునం గనుపట్టి తనువల్లిక వణంక నయ్యాశ్రమంబు వెడలివచ్చునెడఁ దోడంగూడి యరుదెంచిన పువ్వుఁబోండ్లయందు నొక ప్రోఢ యిట్లనియె. ౧౦౪.

సీ. వనిత యమ్మునిప్రోడవద్దనె వద్దనె చెప్పితి నామాట సేయవైతి
చేర నేటికిఁ గీడుగోరనె గోరనె సన్నఁ జేసినఁ గానఁ జాలవైతి
రమణి పోదము పీడి రావేల రావేల గాదని చెప్పినఁ గానవైతి
నిక్కపువరుఁడని నీవింత నీవింత పిల్లచేఁతలు చేసి జేలవైతి
వకట నీ సేరమని యెంతయనిన ఫలము । నేమి రాఁగంటు నీ చిన్నిమోము దమ్మి
మెఱుఁగుదప్పిన యద్దంబు తెఱఁగు దాల్చె । నేమిచేయుదు నింక నాకేది దిక్కు.

క. అని వగచుచు నాయంగన । మన సూఱడిలంగ మంచి మాటలచే నె
య్యాన నవ్వి దాని యనుమతిఁ । జనియె నిజస్థానమునకు సఖులుం దానున్. ౧౦౫.

వ. తదనంతరం బారంభ తచ్చాపదవానల జ్వాలసోఁకి వసివాళ్లువాడు తనువల్లిచే నల్లనల్లన వచ్చి చతుర్థన బాహాపరిపాలితంబైన కుండిన నగరసమీపంబున నొక్క వనాంతరంబున. ౧౦౬.

సీ. నెరులసౌరభ్యలందు నెమ్మోము సిరిచంద్రునందుఁ గన్నుల మెఱుంగంబుజాత
ములయందు మోవిచాయలు బింబములయందుఁ గంఠంబుసొంపు శంఖంబునందుఁ
జనుదోయిగరిమంబు చక్రవాకములందుఁ గొనువిలాస మాకసమునందు
జఘనమండలియొప్పు జగతీతలమునందు నడుగులపస చివురాకులందు
నడలమురిపంబు గజగమనములయందు । మేనిచెలువంబు క్రొక్కారు మెఱుపులందుఁ
బలుకు సుకుమారమెల్లఁ రాచిలుకలందుఁ । జేరఁ దొలిమేను వదలి యాచిగురుఁబోఁడి.

సీ. ప్రియుని కెమ్మోవి చుంబింపనోపని లేమ కరిసఖలీన మేగతి వహించు
హారంబు బరువనియలయు లతాతన్వి వాలుల నెట్టి కైవడి ధరించు
జడసోఁకులోర్వఁగాఁ జాలనితరళాక్షి కడువంకపల్లమే కరణిఁ బూను
నొడ్డాణమును దాల్పనోపని సతి పొట్టఁబట్టెడబిగి నెటువలె సహించు

మిగుల మెత్తని నడుపుల మెలఁగునింతి । మనసుకంటెను జవమున మసలునెట్టు
లనుచు దేవత లద్భుతమందిచూడ । రాజకులనాథ సాంబ్రాణి తేజియయ్యె.

ఉ. కుండిన వల్లభుండు రిపుకుంజర సింహపరాక్రముండు దో
ర్దండ ధృతావనీతలుఁడు దాన జితామరభూజ చంద్ర మా
ర్తాండతనూభవుండు వనితామదనుం డొకనాఁడు వేడ్కతో
మండలనాథులున్ హితులు మాన్యులు భామలుఁ జేరికొల్వఁగన్. ౧౧౦.

గీ. భానుఁ డుదయాద్రిపైనున్న పగిది రత్న । ఖచిత సింహాసనంబుపైఁ గడుముదమున
నాత్మతేజంబు దిక్కుల నాక్రమింప । నోలగంబుండె సకల నేత్రోత్సవముగ. ౧౧౧.

వ. అప్పుడు. ౧౧౨.

క. కరికుంభజాతమౌక్తిక । పరికరమును సంకుమదము ఫలములుఁ జెంజా
మరలు మృగమదముఁ గప్పురం। సిరముగఁ గొనివచ్చె నొక్క చెంచయ్యెడకున్.

గీ. వచ్చి కడుసంభ్రమంబున వసుమతీంద్రు
నంఘ్రులకు మ్రొక్కి యా యుపాయనము లెల్ల
సమ్ముఖంబునఁ బెట్టి హస్తములు మొగిచి
తన వచఃప్రౌఢి మెఱయ నిట్లనుచుఁ బలికె. ౧౧౪.

శా. సామీ గూడెములోని మాప్రజలు నిచ్చల్ పండుగల్ సేయుచుం
క్షేమం బామరతంపరై మనుదు రేభీతిన్మదింబొందకే
యేమే తప్పులు చేసినన్ గరుణ నీవే ప్రొద్దు మన్నించఁగా
మామా పల్లెలలోననుందు మెలమి న్మాబోటివారారయన్. ౧౧౫.

వ. అని విన్నవించిన నా చతుర్థుండు సంతసిల్లి యా చెంచునకు నిట్లనియె. ౧౧౬.

చ. కలుగునె చేరువన్ బొలము కందువలన్ మృగకోటి పక్షులున్
మెలఁగునె క్రందుగా ననుచు మేల్నగవొప్ప నతండు పల్కినన్
నిలిచి ముదంబుమీఱఁగ వనేచర ముఖ్యుఁడు హస్తనీరజం
బులు మొగిడించి ఫాలమున మోపి చతుర్థునితోడ నిట్లనున్. ౧౧౭.

గీ. మెకము లేమిఖ్యాతి మేదినీవల్లభ । మందలై మెలంగు మావనముల
శరభ సింహ నాగ శార్దూల భల్లూక । హరిణ కిటి శశాదులైన వెల్ల. ౧౧౮.

గీ. కారుఁగోళ్లును గౌఁజులుఁ గక్కెరలును । బూరువములుఁ బూరేళ్లను గేరజములు
గువ్వలును మొదలుగ లెక్కకొలఁదిమీఱఁ। గలవు పులుఁగులు నేతులుగ్రక్కఁగ్రొవ్వి.

వ. మఱియును. ౧౨౦.

క. కూరిమితోఁ దిరుగుచుఁ గ। స్తూరీ మృగకులము పొదలుదూఱఁగ ముండ్లం
జీరినఁ దెరువుల నెత్తురు। కాఱ నవట నెపుడు పచ్చికస్తురి గలుగున్. ౧౨౧.

వ. అని విన్నవించిన సంతసంబొదవి వేత్రహస్తులంజూచి వేఁటరులం బోటరుల వేడుక
కల వేటియగు వేఁటకుం బిలువనంపి తగినవారల నిలిపి యనంతరంబు. ౧౨౨.

సీ. పసిఁడిమ్రాఁతల మచ్చపట్టు దట్టిగఁ గట్టి కస్తూరి దట్టంబుగా నలంది
గరుడపచ్చలమించు కడియాలు ధరియించి యురమున నీలంపు సరులు చాల్చి
మహనీయ వైడూర్యమణి కీలితంబులై పొలుపొందు కుండలములు ధరించి
మంచుచెల్వము సేవగించు నున్ననిపాగ గట్టిగా నొసలిపైఁ జుట్టుచుట్టి
జమునినాలుకఁ బురణింపఁ జాలునట్టి। వన్నె యడిదంబు డాఁపలివంకఁ బూని
శరశరాసనములు పరిచరులు దేర। రాజు చనుదెంచె నంతఃపురంబు వెడలి. ౧౨౩.

వ. ఇవ్విధంబున మృగయోచిత శృంగారంబు నంగీకరించి నిజమనోరథంబునకుం దగిన
రథం బారోహణంబుఁ జేసి యతం డత్యంత సంతోష భరితాంతఃకరణుండై మున్ను
దనకు మృగంబులచొప్పు చెప్పిన యచ్చొప్పరిముందఱ నడువఁ బురంబు వెడలి
చనునప్పుడు విక్రమ ప్రచండ సింహోపమేయంబులగు సారమేయంబులను మృగా
క్రమక్రియాభంగులం బొంగు సివ్వంగులను బలవత్పక్షి హృదయపాటన పాటు
వంబులగు సాళువంబులను వినోదకారణంబులగు నోరణంబులను వెండియు మెకం
బుల నీవలావలం జననీక కన్నుల చెన్నులఁ దగులువఱచు వలలును వలలం జిక్కు
వడమడి వెట్టి యిష్టంబుగాఁ బురికొని పురిదిగుచు నురులం దలంగిలించి తమ
యొరపు దెరవునం జననీక పట్టికొట్టిన నలుపులులం బెట్టుదట్టింపు బోనులును
బోనులం బోనమిడి కోడెలజాడలం బొదలం జేరి యిరుఁగెలంకుల నొత్తుడు కత్తెరలను
నెత్తుడు తెరలను బూని తమ మేని పొంకంబులును బింకంబులును భయంకరంబులు
గాఁగ సంతత హింసిత మృగవ్రాతులగు కిరాతులు సంతోషంబున. ౧౨౪.

సీ. నీలిసాలువమీఁదఁ గీలుకొల్పినయట్టి నెలవంకకత్తుల తళుకు లెసఁగఁ
బొలుచు జుంజురుమీసముల నీలకాంతులగము లిరువంకలఁ గ్రమ్ముకొనఁగ
మిట్టిగ్రుడ్డులమీఁదఁ దొట్టిన జుంజులు చరమసంధ్యారక్తి సౌకళింపఁ
గర్ణార్పితంబులై గనుపట్టు సంకుటాకులు కృష్ణపక్షతారలహసింపఁ
జెలఁగి తలముల్లు వాకట్టు తిలకములును। గను మెఱుంగులు గుతిమంచులును ధరించి
పందివాట్లను జేపట్టి పంతములకు। నొండొరులఁగూడఁ బోయిరి దండిమెఱసి.

వ. అంత. ౧౨౫.


హిందూదేశమునందలి కారెనుము యొక్క కాళ్లను గొరిజలును పొట్టివిగా నుండును; చెవులు పొడుగుగానుండును. కారెనుములలో మగవి ముసలివైనప్పుడు నల్లఁగా నుండును; ఆఁడువానికిని చిన్నవానికిని శరీరచ్ఛాయ కొంచె మెఱ్ఱఁగా నుండును; అడుగుభాగములు బూడిదవర్ణము కలవిగానుండును; డెక్కల పయిభాగ ములును మోకాళ్ళపయినుండి కాళ్లను తెల్లఁగానుండును. పెద్దయెనుములు భుజముల వద్ద నాఱడుగుల యెత్తుండునుగాని సామాన్యమైనవి యైదునర యడుగులయెత్తే యుండును. ఒక పెద్ద యెనుమునకు ముట్టెమొదలుకొని తోఁకవఱకును తొమ్మిదినర యడుగుల పొడుగుండినది. తోఁకపొడుగు రెండునరయడుగు లుండును. కొమ్ముల పొడుగు రెండడుగులవఱకు నుండును. ఇవి హిందూదేశమునం దన్ని యరణ్యముల లోను నున్నవి. ఇవి యయిదాఱు మొదలుకొని యిరువదివఱకును జేరి మందలుగా నుండును. ఇవి మిక్కిలి బెదరుగలవయి సాధ్యమయినంతవఱకు సేద్యము చేయఁబడు పొలముల చెంతకు రాకుండునుగాని యొకానొకప్పు డరణ్య ప్రాంతములయందున్న పొలములలోఁ బడి పైరులు మేసిపోవుటయుఁ గలదు. ఇవి సామాన్యముగా గడ్డితినును; విప్పుడో యొకప్పుడు కొన్నిచెట్లయాకులను బెరడును తినినను సాధారణముగా చెట్ల యాకులు మేయవు. లేఁత వెదురుమొలకలు కారెనుములకు ప్రియతరమైన యాహారము. అవి ప్రాతఃకాలమునందును సాయంకాలమునందును మేఁతమేసి పగలు తొమ్మిదిగంటలు మొదలుకొనినాలుగుగంటలవఱకును రాత్రియువిశ్రాంతిపొందును. మధ్యాహ్నముమీఁదఁ బోయి నీరుత్రాగివచ్చును. ఇవి యొడుదొడుకుగానుండు కొండల ననాయాసముగా నెక్కి దిగఁగలవు. ఇవి మనుష్యులను జూచినప్పుడు బెదరి పాఱిపోవునవియే యయినను గాయపడినప్పుడు పాఱిపోక యెదురుతిరిగి మీఁదఁబడి భయంకరముగా పొడిచి చంపి వేయును. కాఁబట్టి కారెనుములను వేఁటాడుటలో మిక్కిలి జాగరూకత కలిగియుండ వలెను. ఒకానొకప్పు డివి గాయపడకపోయినను బెదరి మనుష్యులపైనిబడి కొమ్ములతో క్రుమ్ముటగలదు. ఇవి మిక్కిలి బలిష్ఠములయిన జంతువులు. ఇవి సాధారణముగా శ్రావణ భాద్రపదమాసములలో దూడలనుపెట్టును. ఇంతవఱ కీదేశములో వీనినిమచ్చికచేయుట కయి చేసిన ప్రయత్నములన్నియు విఫలములయి పోయినవి. దూడలను బట్టుకొని పెంచి నప్పుడు వానిలో నొక్కటియు మూడేండ్లువచ్చువఱకైనను బ్రదుకలేదు. ఇవి కారెనుము లని పిలువఁబడినను, మహిషజాతికంటె గోజాతినే యెక్కువగాఁ బోలియుండును.

బత్తై.

బత్తైలలో మగదానిని దున్నపోతనియు, ఆఁడుదానిని గేదెయనియు, చెప్పుదురు. ఎద్దునకువలెను కారెనుమునకు వలెను బత్తైకు మూపురముండదు; ఎద్దుకొమ్ములవలె

గుండ్రముగా నుండక దీని కొమ్ములు కొంచెము పలకలుగానుండి పొడుగుగా నుండును. ఆఱడుగులపొడుగు కొమ్ములుగల యడవి బఱ్ఱెలు కొన్ని యప్పుడప్పుడు కానఁబడుచు వచ్చెనని కొందఱు చెప్పుచున్నారు గాని సాధారణముగా బఱ్ఱె కొమ్ములు నాలుగడుగుల పొడుగుండును. బఱ్ఱెలలో పోతుకొమ్ములకంటె గేదె కొమ్ములు పొడుగుగానుండును. అడవిబఱ్ఱె లడవులలో నేనుఁగులుండుచోట్లను వానివలెనే వసించును. అడవిబఱ్ఱెలు దక్షిణ హిందూస్థానమునందు లేవు. ఈయడవి బఱ్ఱెలనే కొందఱు కారెనుములని పిలుతురుగాని యది సరికాదు. ఇవి రెండును వేఱువేఱుజాతి జంతువులు. అడవి బఱ్ఱెలును పెంపుడుబఱ్ఱెలునుమాత్రము భేదమేమియు లేక యేకజాతివిగానున్నవి. ఇవి సాధారణముగా నయిదడుగుల యెత్తుండును; వీని నిడివి తలమొదలు తోఁకదాఁక తొమ్మిదడుగులవఱకు నుండును; తోఁక మూడడుగుల పొడుగుండును. ఇవి పెద్దపెద్ద మందలుగా నుండును. ఒక్కొక్కమందలో గేదెలును దూడలునుగలిసి యేఁబదియు నంతకంటె నెక్కుడుగాను సహితముండును. పోతులుమాత్రము వానితోఁ జేరక యయిదారేసి వేఱువేఱుగాఁ దిరుగుచుండును. ఎదపోయినకాలమునం దొక్కొకపోతా మందలోని గేదెల నయిదాఱింటిని విడఁదీసి వానివెంటఁ దిరుగుచుండును. అడవిగేదెలను గమిడిగేదెలని చెప్పుటయుఁ గలదు. ఇవి సామాన్యముగా సాధుజంతువులుగానే యుండునుగాని కోపము వచ్చినప్పుడు మహా భయంకరముగా శత్రుజంతువులమీఁదఁబడి వానిని పడఁబొడుచును. వీనికి మనుష్యుఁడుతప్ప వేఱు శత్రుజంతు వేదియులేదు. ఇటువంటి బలిష్ఠములగు జంతువుల జోలికిఁ బోవుటకు పెద్దపులులు సహితము సాహసింపవు. ఇవి ధైర్యమును సాహసమునుగల జంతువులు. వీని మందల సమీపమునకు వ్యాఘ్రమువచ్చుట తటస్థించిన పక్షమున, అనేకములు గుంపుగాఁబోయి మీఁదఁబడి దానిని కొమ్ములతోఁ గ్రుమ్మి చీల్చి చంపివేయును. ఇవి కొన్నిసమయములయందు కొండగ్రామములలోనికి వచ్చి యడ్డము వచ్చినయెడల యజమానులను దఱిమి పొలములు మేసిపోవును. ఇవి యత్యంత బలముగలవి యగుటచేత నొకానొకప్పు డేనుఁగులను సహితము పడఁబొడుచును. ఇవి ప్రాతఃకాలమునందును సాయంకాలమునందును మేఁతమేసి యెండవేళను చెట్లనీడలోను చల్లని గడ్డిలోను బురదలోను నీళ్ళలోను బరుండును. వీనిని బట్టి తెచ్చి సులభముగా మచ్చిక చేయవచ్చును.

ఈ దక్షిణ హిందూస్థానమునం దుండెడు పెంపుడుబఱ్ఱె లడవిబఱ్ఱెలకంటెఁ గొంచెము భేదపడియుండును. ఇవి మిక్కిలి యుపయుక్తములయిన జంతువులు.



గేదెలు పాలిచ్చును; దున్నపోతులుబండ్లు మొదలయినవి లాగును. బఱ్ఱెశిరస్సీప్రక్కపటమునఁ జూపఁబడియున్నది. వరిపొలములు మొదలయిన చిత్తడి భూములను దున్నుటలో నెద్దులకంటె దున్నపోతు లెక్కువ యుపయోగకరములైనవి. వీని కొమ్ములతో దువ్వెనలు మొదలయినవి చేయుదురు. అడవిగేదెలవలెనే యివియు శౌర్యసాహసములుగలవి. ఇవియు పెద్దపులుల నెదిరించి పొడిచి చంపఁగలవు. ఇట్టి పనికై కావలసివచ్చినప్పు డివి రెండు మూడేకముగాఁ జేరును. అడవిగేదెలవలెనే పెంపుడు గేదెలును మధ్యాహ్నవేళను తలలుమాత్రము పైకెత్తి నీళ్ళలోను బురదగుంటలలోను బరుండును. వీని దేహమున రోమములు మిక్కిలి పలుచగా నుండును. అడవి గేదెలును పెంపుడుగేదెలునుగూడ పదిమాసములు గర్భము ధరించి యొక్కదూడను పెట్టును.

చమరీమృగము.


ఇది గోజాతిలోనిది. దీని మెడక్రింద గంగడోలుండదు. కాళ్లు కుఱుచగా లావుగా నుండును; గొరిసెలు గుండ్రముగా పెద్దవిగానుండును; చెవులును ముట్టెయును పొట్టివి. ఇవి నైదాఱడుగులయెత్తును, ఏడడుగుల నిడివియు, కలవిగానుండును. వీనితోఁక మూడడుగుల పొడుగుండును. ఇవి హిమాలయపర్వతముల కుత్తరమున టిబిటీయ దేశములో విస్తారముగానున్నవి. ఇవి పర్వతములలో నితరమృగము లేవియు పోఁజాలనంత యెత్తునకుఁబోయి యక్కడ వసించి మేయును. ఇవి దేహమునిండను దీర్ఘములైన వెండ్రుకలను గలవయి నల్లరూపున నెద్దులను బోలియుండునుగాని వీని తోఁకలుమాత్రము గుఱ్ఱపుతోఁకలవలె నుండును. ఇవి పది మొదలుకొని నూఱువఱకును జేరి మందలుగా వసించును. మగమృగములుమాత్ర మీ మందలతోఁ జేరక వేఱుగా వసించును. వీనిని బట్టి తెచ్చి సులభముగా మచ్చిక చేయవచ్చును. అడవి మృగములకంటె పెంపుడువి చిన్నవిగా నుండును. టిబిటీయదేశస్థు లీ జంతువులను పాలనిమిత్తమును బరువులుమోయు నిమిత్తమును మన మిక్కడ గోవులమందల నుంచుకొన్నట్లే మందలుగాఁబెట్టుకొనియున్నారు. చమరీమృగముయొక్క పెద్దతోఁకను సవరములకొఱకును వింజామరముల కొఱకును నుపయోగింతురు. ఇది గేదెవలె నఱచును కాఁబట్టి దీనిని జడలబఱ్ఱెయనియుఁ జెప్పుదురు. పెంపుడు మృగములలోఁ దెల్లవియుఁ గొన్నిగలవు. వాని తోఁకలతో దేవతాప్రతిమలకును రాజులకును గుఱ్ఱములకును విసరుటకై వింజామరలను జేయుదురు. ఇది పదినెలలు చూలుదాల్చి యొక్కదూడ నీనును.

ఇటువంటిదే యమెరికాఖండమునందు కస్తూరి యెద్దనఁబడెడి జంతు వొకటి కలదు. దీనివలెనే దాని దేహమున నిడుదవెండ్రుకలతో నిండియుండును. దాని మాంసము కస్తూరికంపు కలదగుటచేత తినుటకు పనికిరాదు.

గోవులు.


ఈ దేశములో గోజాతికి మెడక్రింద పొడుగునను గంగడో లనఁబడు చర్మము వ్రేలుచుండును. తక్కిన పశుజాతి జంతువులకును దీనికిని గల భేద మిదియొకటి. యూరపుఖండములోనుండు గోవులకు మెడక్రింద గంగడోలుండదు. ఈ దేశమునందును మెడక్రింద గంగడోలులేని యడవిగోవులు గలవు. వానిని మనవారు గవయమృగములని చెప్పుదురు. వానిని బట్టి తెచ్చి మచ్చికచేసి గోవులనువలెఁ బెంచవచ్చును.

పెంపుడుగోవులు.



గోజాతిలో నాఁడువి యావులనియు, మగవి యెద్దులనియు, చెప్పఁబడును. పూర్వకాలమునుండియు హిందువులకు గోవులు ప్రియతరములైన జంతువులు. పూర్వపు ఋషు లావులను హోమధేనువులనియు కామధేనువులనియు పిలుచుచుండిరి. ఆవులు మనకు పాలిచ్చును; ఆ పాలతోనే మనము పెరుగు, మజ్జిగ, వెన్న, జున్ను, మీగడ, నేయి, మొదలయిన రుచ్య పదార్థములను జేసికొని భుజింతుము. ఆవు కొమ్ములతో బరిణెలు, దువ్వెనలు, కత్తి పిడులు, పెట్టెలు మొదలైనవి చేయఁబడును. చర్మములతో చెప్పులు, గుఱ్ఱపుజీనులు, పుస్తకముల యట్టలు, మొదలైనవి చేయుదురు. గొరిసెలతో వజ్రమనఁబడెడి యొక విధమైన జిగురు పదార్థము చేయఁబడును. ఎముకలను సౌకగాఁ జేయు వస్తువులయం దేనుఁగు దంతమునకు మాఱుగా నుపయోగింతురు. ఎముకలను కాల్చి పొడుముచేసి బలము నిమిత్తమయి పొలములకు వేయుటయేకాక యా పొడుముతో పంచదార మొదలైనవానిని శుభ్రము చేయుదురు. గొడ్డుక్రొవ్వు దీపపు వత్తుల కుపయోగపడును. గోవుల చేఁదుకట్టులోని గోరోజనము మందులకు పనికివచ్చును. నరములతో సంగీతవాద్యములకు తీఁగెలు చేయుదురు.

పంచితమును క్షయరోగము కలవారి కిత్తురు. గోమయముతో నిండ్లలికియు పొలముల కెరువుపెట్టియు పిడకలుచేసి వంటచెఱుకునకు మాఱుగా వాడుకొనియు పెక్కు లాభకరములైన పనులను జేసికొందురు. ఈ కలియుగములో బౌద్ధమతము ప్రబలిన తరువాత గోవధము నిషేధింపఁబడినను, పూర్వపు ఋషులు గోవులను జంపి వాని మాంసమును సహితము తినుచుండెడివారు. ఇవిగాక గోమయము మొదలైన పంచగవ్యములను కర్మలయం దుపయోగించుకొనుచుండిరి. ఎద్దులు బండ్లను లాగుటకును పొలములను దున్నుటకును నుపయోగపడును. మన యుపయోగార్థముగా మన కెన్నివస్తువుల నిచ్చి యిన్నివిధములఁ దోడుపడెడు గోవును మన పూర్వులు కామధేను వని పిలిచి పూజించుట వింతకాదు. మన పూర్వులు చక్కఁగా మేపి గోవులను కాపాడుటయేకాక మంచి వంగసము వృద్ధిపొందుటకయి బలమయిన గొప్ప కోడెలను దేవునిపేరుచెప్పి యచ్చువేసి యా యాఁబోతుల నూరిమీఁద విడిచిపెట్టుచువచ్చిరి. పొలమును దున్నుటకయి యెద్దుల నుపయోగించెడు పూర్వకాలమునం దింగ్లండు దేశములో సహితము గోవధము నిషేధింపఁబడియుండెనుగాని కృషికర్మయందు వృషభము లకు మాఱుగా గుఱ్ఱముల నుపయోగింప నారంభించినతరువాత గిత్తలు మాంసము నిమిత్తమే పెంచఁబడుచున్నవి. ఈ క్రిందిపటమునఁ జూపఁబడినది సీమయెద్దు—



గోమాంసభక్షణము చేయువా రనేకదేశములలో నున్నను, కృషికర్మలో నెద్దుల నుప యోగించెడు ప్రపంచములోని యన్నిదేశములయందును గోవధము నిషేధింపఁబడియే యున్నది. ఈ హిందూదేశమునందు గోవుల నెఱుఁగనివా రెవ్వరు నుండరుగాన వాని రూపమును జూపవలసిన యావశ్యకము లేదు. ప్రథమపటమునఁ జూపఁబడినది సీమయావు. దానివీపీపలావల నెత్తుగానుండి నడుమ పల్లముగానుండును. ఆ యావు దినమునకు

పండ్రెండుసేరుల పాలిచ్చును. అక్కడి యావు మిక్కిలి సాధువయినది. అది దూడ లేకపోయినను పాలిచ్చును. ఇక్కడి వృషభమునకంటె నీమయెద్దు పొగరుఁబోతగుటచేత దాని నెప్పుడును కట్టిపెట్టి యుంచవలెను. దానిని స్వేచ్ఛముగా విడుచుట యపాయకరము. మన దేశపు వృషభములకుమాత్రమే మూపురముండునుగాని యూరపుఖండములోనివాని కుండదు; అక్కడివానికి మెడక్రింద గంగడోలు సహితముండదు. ఇక్కడి యెద్దులు యూరపుఖండములోని వానికంటె నెక్కువ తెలివియు సాధుత్వమును గలవి. ఇక్కడి యావులుమాత్ర మంత సాధువులుగావు; అక్కడనిచ్చినన్ని పాలునునియ్యవు. ఇక్కడివి దూడ దాపునలేకపోయినపక్షమున, పాలియ్యనేయియ్యవు.

---

౬. ఉష్ట్రజాతి.

ఈజాతి జంతువులు నెమరువేసెడు తక్కిన జంతువులకంటె భేదపడియుండును. నెమరువేసెడు సమస్త మృగములకును కాళ్ల కొనలను గొరిసెలుండును; వీనికిమాత్రము గొరిసెలులేక వ్రేళ్లను గోళ్లను నుండును.


లొట్టిపిట్ట.



వీపునఁ బెద్ద మూపురముతో పొడుగుగానుండి వికారరూపముతో నడుచుచుండెడు లొట్టియను దీనిం జదువువా రనేకులు చూచియుందురు. ఈ పయిపటమునఁ జూపఁబడియున్నది దాని రూపమే. ఇది మహా విచిత్రమైన జంతువు. నెమరువేయు జంతువులలో నెల్ల దీని కొక్కదానికిమాత్రమే మీఁదిపండ్లుండును. దీని కాళ్ల యడుగున డెక్కలకు మాఱుగా రెండు పొట్టివ్రేళ్లను వ్రేళ్లకొనలను జిన్నగోళ్లను నుండి


యడుగుభాగము మెత్తనయి యుండును. ఇది చూపులకు వికృతరూపము కలదిగాఁ గనఁబడినను, ఇది తాను వసించు దేశములలో నిసుకప్రదేశములయందుఁ బ్రయాణము చేయువారి కత్యంతోపయుక్తమయినదిగా నున్నది. చెట్టు చేమలులేని యిసుక దారులలో నొంటెయొక్క సాయములేక యాత్రచేయుట యసాధ్యము. ఇది జలాహారములులేక బహుదినములు వీపుమీఁద పెద్ద బరువులతో నలయిక నొంధక దారి నడువఁగలదు. ఇది యొక్కసారి నీరుత్రాగెనా, మరల నయిదాఱు దినముల వఱకును దీనికి జలమక్కఱలేదు. దీని జీర్ణకోశములోఁ గొంతభాగము మధుకోశము వలె లోఁతయిన రంధ్రములతో నిండియుండును. నీరు దొరకినప్పుడు లొట్టిపిట్ట నీరధికముగా త్రాగి దాని నా రంధ్రవంతమయిన కోశములో నిలువచేసికొని మరల నీరు పానము చేయవలసిన యావశ్యకములేక లోపలిజలముతోనే కావలసినప్పుడెల్లను నడుమనడుమ దాహము తీర్చుకొనుచుండును. దీని వీపుమీఁద పెద్ద మాంసపుముద్ద వలె నుండు మూపురములోని క్రొవ్వుకరఁగి కావలసినప్పు డాహారమగుచుండును గనుక, ప్రయాణములయందు దెడారులలో నచ్చటచ్చట నల్పముగా లభించెడు గిటక పొదలయాకులే బహుదినములు దానిమేఁతకుఁ జాలియుండును. అట్టి యల్ప జలాహారములతో గుఱ్ఱములుగాని యెద్దులుగాని ప్రయాణము చేయవలసివచ్చినపక్షమున, అవి మఱునాఁటికే బలహీనపడి శుష్కించి నడువలేక కొన్నిదినములలోనే ప్రాణములు విడువవలసినవగును. అట్టి సమయములలో లొట్టియలకు మూపు కరఁగుట తప్ప వేఱు నష్ట మేమియుఁ గలుగదు. ఇసుకలో నడుచునప్పుడు లొట్టిపిట్టయొక్క విశాలములైన మెత్తని పాదములు భారవాహులయిన గుఱ్ఱములు మొదలయిన జంతువులకువలె క్రిందికి దిగఁబడవు. ఇసుక బయళ్ళలో నిది పెద్ద బరువులతో నశ్రమముగా నడువఁగలిగినను, గట్టినేలను బురుదలోను నడచుటకు దీనిపాదములు పనికిరావు. గట్టినేలను దీనిపాదములు జాఱును. జాఱినప్పుడు క్రిందఁబడెనా, దీని కపాయము సంభవించును. ఇవి బహు వేగముగా ననఁగా గంట కాఱుమైళ్లచొప్పున బహుదూరము గంటలకొలఁది కాలము నడువఁగలవు. బాక్ట్రియాదేశమునందుండెడి యుష్ట్రములకు వీపున రెండు మూపురము లుండును. అట్టివి మనదేశములో లేవు. లొట్టియ లడవిస్థితిలో నెక్కడను గానరావు.

లొట్టియ లరాబియా దేశమునం దధికముగానున్నవి. అక్కడివారికవి మన కావు లెంత యుపయుక్తములో యంత యుపయుక్తములగుటచేత వారు వానిని బిడ్డలవలెఁ బ్రేమతోఁ జూతురు. అక్కడివారు సాధారణముగా లొట్టియలపై నెక్కి దేశయాత్రలు చేయుటయేకాక వాణిజ్యపు సరకులనుగూడ వాని వీపులమీఁదనే కొనిపోవుదురు.



ఈ పటమునుబట్టి లొట్టియలపై మనుష్యులెక్కి కూరుచుండు విధమును దెలిసికొనవచ్చును. ఒక్కయుష్ట్రమిరువదియైదు మొదలుకొని యేఁబది మణుగులవఱకును బరువు మోయఁగలదు. ఆదేశపుజనులు లొట్టిపిట్టపాలు త్రాగుదురు; దాని మాంసమునుతిందురు; దాని బొచ్చును ప్రతిసంవత్సరమును కత్తిరించి వస్త్రములను మెత్తలను జేసికొందురు.

అమెరికాఖండములోనుండెడు 'లామా' యను జంతువొకటి మూపురములేని చిన్న లొట్టిపిట్టవలె నుండును. అది చిన్న గుఱ్ఱమంతయుండి దీర్ఘరోమములతో నిండిన చర్మమును గలదైయున్నది. ఇసుక ప్రదేశములో లొట్టియ లుపయోగపడునట్లే యీ జంతువులు పర్వతప్రదేశములలో నీరక్కఱలేకుండ దూరప్రయాణములు చేసి బరువులుమోయుట కుపయోగపడును. ఈజాతిలోనిదే 'యాల్పాకా' యను కొంత చిన్నజంతు వొకటియున్నది—



ఆల్పాకా.

దీని శరీరము పైని మృదువులై దీర్ఘములైన సన్న రోమములుండును. ఆరోమములతో నీజంతువు పేరిటఁ బిలువఁబడు మృదువైనబొచ్చు బట్టలను సేయుదురు.

ఉ. వారికి బుద్ధిమంతుఁ డగువాఁడె బలాధికుఁడైనవాఁడు గా
కారయ బుద్ధిహీనునకునైన బలంబది నిష్ఫలంబు దు
ర్వారగ మదంబునం బరఁగి వాలినసింహముఁ జంపె నేర్పుతో
నీరస మెక్కుడైన శశ మిట్టిదొ బుద్ధిబలంబుచూడుమా. ౨౨౮.

వ. అనినం గరటకుం డక్కథ నాకెఱింగింపుమనిన దమనకుం డిట్లనియె. ౨౨౯.

ఉ. ఉగ్రవనంబులోన హరి యొక్కఁడు వసియించి సర్వస
త్త్వాగ్రహణార్థియై బహువిధంబుల మాంసముఁ దించుచుండెఁ ద
ద్వ్యగ్రతఁ జూచి జంతుతతులన్నియుఁగూడి మృగేంద్రుపాద ప
ద్మాగ్రము లొందలఁ గదియ నార్తిమెయిం బ్రణమిల్లి యిట్లనున్.

సీ. అవధరింపుమృగేంద్ర యడవి జంతుసమూహమిదె విన్నపంబున కేగుదెంచె
నెట్లన్న నన్నింటి నెసరేఁగి యొక్కటఁ జలపట్టి యొకనాఁటఁ జంపనేల
నిత్య మొక్కమృగంబు నీకుఁ గట్టడగాఁగఁ బ్రీతి నాహారంబు పెట్టఁగలము
సమ్మతింపుమనిన సకలజంతువులకు నట్లకానిమ్మని యభయ మొసఁగి
యనుప నవివోయి నిత్యకృత్యంబు గాఁగ । నుదయమయ్యెడి కొలఁదికి నొకటిఁ బంప
నది భుజించి హర్యక్షము ముదముఁ బొందు । నీవిధంబునఁ జిరకాల మేగునంత.

క. పులి కోలుకాఁడు గావున । నలయక వరుసెఱిఁగి వాని ననుపఁగ నొకనాఁ
డొలసి యొక చెవులపోతుకుఁ । గలయఁగ నిలువరుసయనుచుఁ గ్రక్కునఁ జెప్పన్.

గీ. పలుకువిన్నమాత్ర ప్రాణంబు చలియింప । శశక మపుడు మూర్ఛఁ జాలఁదూలి
తెలిసి కన్నుదెఱచి దృష్టించి తలయూఁచి । దిగులుపుట్టి యాత్మ పగులనాగిలి.

వ. ఆ శశకంబు ముహూర్తమాత్రంబు చింతించి తెలివొంది డెందంబు కొందలంబుడిపి
కొని వృద్ధుండయ్యును సాహసంబుఁ దెచ్చుకొని తనలో నిట్లని వితర్కించె. ౨౩౦.

క. క్రూరమృగ నిగ్రహోగ్ర । స్ఫార మహాబలమృగేంద్రు సాహసమెసఁగన్
వారింతుఁ బ్రొంతునెక్కడ । సారంబగు నాదుబుద్ధి చాతుర్యమునన్. ౨౩౧.

వ. అని మఱియుం దనమనంబున. ౨౩౨.

క. బుద్ధికి నశక్యమగు పని । యుద్ధాత్రిం గానఁగలదె యిదె గెలిచెద నా
బుద్ధిబలంబున సింహము । నుద్ధతి యణఁగించి ప్రాణయుక్తికిఁ బాయన్. ౨౩౩.

క. అనుచుఁ దలపోసి యా శశ । మనుమానింపుచును గదలు నప్పటికి నినుం
డును నభోమధ్యగతుండగు । డు నతి క్షుత్పీడచేఁ గహంగ్రోధమునన్. ౨౩౪.

గీ. అపుడు గఱచి కంఠీరవంబోర యివ్వ । నమున మృగములు నేఁడు గర్వమున నేచి
దినదినంబును నాకుఁ బుత్తెంచుమృగము । ననుప నిదియే మొకో యను నవసరమున.

క. అడుగులు తొట్రుపడంగా । నడలొందిన యదియపోలె నయ్యెయెడలన్
బుడమింబడి మ్రొగ్గి లేచుచు । గడుసరియగు శశక మెయ్యెఁ గదియంబోవన్.

క. అప్పుడుచూచి మృగేంద్రుఁడు । నిప్పులు కనుదోయినుండి నెగయఁగ నోరీ
చొప్పడదు వేళదప్పిన । యప్పటి యశనంబు నాకు నహితంబగుచున్. ౨౩౭.

క. అపరాహ్ణవేళ దాఁకం । గపటంబున నిట్లు రాని కారణమేమీ
విపరీతంబులు పుట్టెనొ । విపినంబుననున్న జంతు వితతికి నెల్లన్. ౨౩౮.

వ. అని యివ్విధంబున రోషావేశంబునఁ బలుకుచున్న మృగేంద్రునకు సాష్టాంగ దండ
ప్రణామంబులుచేసి శశకం బిట్లనియె. ౨౩౯.

చ. కినియక చిత్తగింపు మొకకీడును నాదెసలేదు నేఁడు సూ
ర్యుని యుదయంబువేళ నను నొక్క మృగేంద్రుఁడువచ్చి యడ్డగిం
చిన నిది యేల యేలికభుజింపఁగఁబోయెడి నన్నుఁ బోవని
మ్మనిన వనంబు జంతునివహంబుల కేలిక నేన కానొకో. ౨౪౦.

వ. అనుచుఁ బెద్దయుం బ్రొద్దతండు నన్ను దేవర సమ్ముఖంబునకుఁ బనివిననీక నిలిపి
మఱియు నిట్లనియె. ౨౪౧.

క. నాకంటె నధికుఁ డెవ్వఁడు । నాకతనిం దెచ్చిచూపిన న్నినుమెత్తున్
లేకున్న నిన్నుఁ ద్రుంతుం । గాకని యతఁ డప్పుడనుపఁ గడుభీతిమెయిన్. ౨౪౨.

క. ఆవిధ మెఱిఁగించుటకై । దేవరయున్నెడకుఁ బాఱుతెంచితి నీకుం
దేవలసినట్టి మృగమును । రావిడువఁడనిన నతఁడు రభసంబెసఁగన్. ౨౪౩.

క. ఏవంక నుండు నాహరి । యేవేళకు నాకుఁ జిక్కు నే నేభంగిన్
భావించి యతనిఁ గదియుదు । నావుడు నాతనికి శశకనాథుం డనియెన్. ౨౪౪.

క. సింగం బాఁకలిగొని సా । రంగాది మృగాళి వెనుక రయమునఁ జను నీ
వంగీకరించి కదలుము । వెంగలి మృగరాజుఁబట్ట వెఱపేమిటికిన్. ౨౪౫.

క. అను పలుకువిన్నమాత్రన । తన మదిఁ గ్రోధానలంబు దరికొన శశకం
బున కనియె నోరిముందఱ । వనమున వాఁడున్నదెసకు వడిఁ జనుమనుచున్.

సీ. ఆమృగేంద్రుండు మహాజవంబునఁ బాఱ నతనిముందఱఁ దాను నతిరయమున
నెలయించి చెవులపోతెంతయు దూరంబుఁ గొనిపోయి మున్నుచూచినయగాధ
జలములుగల కూప సన్నివేశంబున నిలుచుండి నీశత్రునికి నివాస
యోగ్యంబు నెలవిదియూహించి డగ్గఱి చూడుమాయనఁ దొంగిచూచునప్పు
డాత్మదేహంబు కూపజలాంతరమునఁ । గాంచి వేఱొకసింహంబుగాఁ దలంచి
కన్నుగానక మౌర్ఖ్యంబు కతననుఱికి । యపుడ మృతిఁబొందె దుర్బుద్ధియగుటఁ జేసి.

వ. కావున నెంతటి బలవంతునైనను బుద్ధిబలంబునంజేసి బుద్ధిమంతుండు గెలుచుననఁ
గరటకుం డట్లుకాక నీకుఁ గార్యసిద్ధియయ్యెడు మరుగుమనిన దమనకుండు పింగళకు
సమ్ముఖంబునకుంబోయి నమస్కరించి యిట్లనియె దేవరకు నే నత్యంతాపరా
ధంబు చేసితి సంజీవకునిఁ గొలువంబెట్టి తగనిపనిఁ జేసితిఁగావున నీయపరాధంబు
సహింపవలయునని యిట్లనియె. ౨౪౮.

క. పదవిం బొందిన సచివుఁడు । పదఁపడి నృపునెదుట నెట్లుపలికిన నమరున్
బదహీనుఁడు తగుపలుకులు । పదివేలాడినను భూమిపతికింపగునే. ౨౪౯.

క. అనినం బింగళకుం డా । తనితో నీవేమి చెప్పఁదలఁచిన నీకం
టెను హితుఁడుగలఁడె నాయొ । ద్దను వెఱవక చెప్పుమనిన దమనకుఁడనిరోషన్.

క. ఈ సంజీవకుఁడెప్పుడు । నా సన్నిధిఁ దప్పనాడి నగుచుండు నినున్
డా సరకు సేయఁడేమిటు । నీసున నినుఁ గొలువఁజేర నీఁడెవ్వానిన్. ౨౫౧.

చ. అదియునుగా కతండు భవదాజ్ఞఁ జరింపక నీ ప్రభుత్వ సం
పదయును మంత్రశక్తియును బ్రాభవశౌర్య మహోద్యమంబులున్
మదమునఁ దప్పనాడును గ్రమంబున నీమహిఁదాన కైకొనన్
మదిఁ దలపోయు నేఁ డెలిసి మానుగ నీ కెఱిఁగింపవచ్చితిన్. ౨౫౨.

గీ. అనిన భయవిస్మయమ్ములు మనముఁగలఁప। నేమియును బల్కకున్న మృగేంద్రుతోడ
నధిప నీమంత్రి నీకంటె నధికుఁడైన । కతన నభివృద్ధి నీకెట్లుగలుగు వినుము.

గీ. మహిమ నత్యుచ్ఛ్రయుండగు మంత్రిమీఁదఁ। బార్థివునిమీఁద నొక్కొక్క పదమునిలిపి
నిల్పి శ్రీస్వభావంబున నిల్వలేక । యుదధికన్యక వారిలో నొకనివిడుచు. ౨౫౪.

౨౫౫.

వ. అని యతండు వెండియు నిట్లనియె.

సీ. మనుజవరుండు నిజామాత్యుగా నొక్కని నిల్పఁ దద్భారంబు నిర్వహించి
తనరు స్వచ్ఛందన వనితాదిసుఖముల మోహ మంతంతకు మురియఁబడఁగ
మోహంబుచే గర్వమునఁ గన్నుగానక గర్వాతిశయమునఁ గానిపనులఁ
జేసి నిజేశ్వరుచే నొత్తునుబుద్ధి నతని నుల్లంఘింప మతిఁదలంచుఁ
దలఁచి దృఢతరముగ నేలిదళముఁగూర్చుఁ। గూర్చి రాజ్యంబుతనకుఁ గైకొనఁగడంగుఁ
గడఁగి నృపపక్షమగువారి కడుపుకిడక । కుశలబుద్ధిని బతిఁ గాలవశునిఁజేయు.
౨౫౬.

వ. అని మఱియును.

ఉ. పెంచి యనేకసంపదలఁ బ్రీతివహింపఁగఁజేసి తన్ను మ
న్నించిన రాజుమీఁదఁ దుది నేరముపెట్టి పరావనీశదే

శాంచిత భూరిసంపదల కాసపడుం డ్ వడి హానిఁబొందునే
మంచితనంబు దప్పులగు మంత్రులకుంగలదే తలంపఁగన్. ౨౫౯

గీ. అతిసమర్థుఁడై మంత్రి కార్యములు దీర్చు। నపుడు హితమతి గాకున్న నదియుఁగాదు
మిగుల ననురక్తుఁడగువానిమీఁదఁ గరుణ। ననపతి యున్నకుండిన నదియుఁగాదు.

వ. అని వెండియు. ౨౬౦

క. సేవకులు లోకమందును। శ్రీవిశ్రుతులైన నేల సేవింతురు ధా
త్రీవిభులఁ దమకు జరగమి। కైవలసిన పంపుసేయనగుఁగాక మహిన్. ౨౬౧

వ. అనినం బింగళకుండు సంజీవకుండు నాకత్యంత స్నేహితుం డెట్లు విడువనేర్తునని
యిట్లనియె. ౨౬౨

గీ. సకలమ్ష్టదోష సహితదేహంబిది। నాకు నేటికనిన నరుఁడుగలఁడె
యట్లు నిజహితుండు నప్రియుం బొకచోటఁ। గడఁగి చేసెనేని విడువరాదు.

వ. అని పలికి సంజీవకు నుద్దేశించి. ౨౬౩

ఉ. నమ్మికయిచ్చి చేకొని ఘనమ్ముగఁ బూజ్యునిఁజేసి మాటమా
త్రమ్మున వీఁడు గాఁడని వృథా బహుదోషము లెన్నిభృత్యు రా
రమ్మనియాజ్ఞ సేయ నగరానను లోకమువారు వానినే
రమ్మనవాఁడె పోవుఁ దెగరాదు కలంపకు నాడుచిత్తమున్. ౨౬౪

వ. అనినవిని దమనకుం డిట్లనియె. ౨౬౫

ఉ. ఎంతయు గారవించి తనునింత యమాత్యునిఁజేసి రాజ్య మి
ట్లింతయుఁ జేతికిచ్చి యనయమ్మును దేవర నమ్మియున్నచోఁ
గొంతయునం దలంపక నిగూఢము గా నుహి యెల్లఁ గైకొనన్
జింత యొనర్చు వీ నెఱిఁగి శీఘ్రమ నీ కెఱిఁగింపవచ్చితిన్. ౨౬౬

వ. మఱియును. ౨౬౭

గీ. అన్నదమ్ముఁడైన నాత్మజుండైనను। సచివపదవిఁ బనులు జరపుచోట
వానిమీఁదదృష్టి వదలినయప్పుడా। రాజుఁ బాయు నిందిరావధూటి. ౨౬౮

చ. సుజన హితోక్తి కర్ణములసోఁకఁగ నీయ కహర్నిశంబునుం
గుజనుల బుద్ధి చిత్తమునఁగూర్చి సరాష్ట్రముగాఁగ నమ్మహీ
భుజుఁడు నశించు రోగి తనబుద్ధినపథ్యమె పథ్యమంచు న
క్కజముగ నాత్మలోఁదలఁచి కాలవశంబునుబొందు చాడ్పునన్. ౨౬౯

ఉ. అప్పటి కప్రియంబయి నిజాత్మకు మీఁదటికిన్ బ్రియంబుగాఁ
జెప్పెడువాక్యముల్ విను సుచిత్తుఁడు నిచ్చక ముజ్జగించి మేల్

తప్పక చెప్ప నుత్తముఁడు ధారుణిఁబుట్టరు పుట్టిరేని య
య్యొప్పిడివారల న్విడువకుండు రమాసతి యెల్లకాలముల్. ౨౭౧.

క. ప్రాఁతయగుమంత్రి తనకుం। జేఁతటికముఁ జేసె ననుచు శిక్షించి యొరుల్
లాఁతిం బెట్టిన నీఁతలు। ప్రోఁతలునై రాజువిడుచుఁ బొందక మూఁకల్. ౨౭౨.

సీ. పాటించి తన ప్రాఁత పరివారమును బ్రోచి హత్తిన నృపునకు హానిగలదె
మొనపేర్చి వైరులు మోహరించినవేళఁ గేడింపకప్పుడె గెలుచుటొండె
మొనసి దైవాధీనమున నపజయమైన భూపాలుఁ గప్పి కొంపోవుటొండె
నర్థంబుదఱిఁగిన నధిపతిధనమిచ్చి నడపనేకుండిన నవయుటొండె
నెవ్విధంబున నైన మహీశువలని। మన్ననకుఁ జాల నిలుతురు మఱవకెపుడు
విడువకుండుదు రెటువంటి వేళలందుఁ। బూర్వపరివారమును బోల్పఁ బురుడుగలదె.

క. అనినం బింగళకుండి। ట్లను సంజీవకున కభయమట్లొసఁగి పద
స్థునిఁజేసి ప్రీతి యొనరిం। చిన నాకెగ్గతఁడు లోనఁ జింతించునొకో. ౨౭౪.

వ. అనిన దమనకుం డిట్లనియె. ౨౭౫.

గీ. ఎంతసఖ్యంబుఁ జేసిన నెంతప్రియము। చేసి తిరిగిన దుర్జను చిత్తమేల
చక్కటికివచ్చు శునక పుచ్ఛంబు కడఁగి। వంకయొత్తినఁ జాయకు వచ్చునెట్లు.

క. కొఱయగు పదార్థమెంతయుం। గొఱయగుఁ గొఱగానిదైనఁ గొఱగాదె చటుల్
నెఱిననమృత ధారఁ బెంచినఁ। గొఱయగునే ముసిఁడి కల్పకుజముంబోలెన్. ౨౭౭.

ఉ. వారక యుత్తముండు దనవారి కపాయము వచ్చువేళ ము
న్నారసి చెప్పి తీర్చును దురాత్ముఁ డెఱింగియుఁ జెప్పకాత్మ ని
ష్కారణ వైరమూఁది తనగాదిలి చుట్టమునైన నిర్దయా
కారతనొంచుఁ గొండియముఁ గైకొను నొండులచేటుకున్నగున్. ౨౭౮.

వ. అని పెండియు నిట్లనియె. ౨౭౯.

సీ. వ్యసనదూరుండైనవాఁడెపో సిద్ధుండు కీర్తితంబగునదె వర్తనంబు
పురుషానుకూలతఁ బొగడొందునదె భార్య బుధవర్ణనీయుండె బుద్ధియుతుఁడు
మదముఁ జేయకయుండునదె మంచిసంపద యాశావిహీనుండె యధికసుఖుఁడు
కపటస్వభావ నిర్గతుఁడె సన్మిత్రుండు విజితేంద్రియుండె వివేకఘనుఁడు
కారణము లేకయును బరకార్యములకు। నోపితీర్చిన యాతండె యుత్తముండు
సమరరంగంబునం దధీశ్వరునిపనికి। వెనుకతియ్యనియాతండె వీరభటుఁడు.

వ. అని పలికి దమనకుండు సంజీవకునిమీఁదఁ బింగళకుని చిత్తంబు తిరుగంబడకుండుట
యెఱింగి యిట్లనియె. ౨౮౧.

సీ. అధిక కామాసక్తుఁడైన భూపాలుండు మొనసి కార్యాకార్యముల నెఱుంగ
డత్యంత మదఘనాహంకారయుక్తుఁడై సన్మార్గ మరుదిగా సంచరించుఁ
[illegible]దరి భృత్యామాత్య దోషవిచారంబు చాలక శిక్షింప శక్తిలేక
యపవాద కంటకాయతశోక గహనంబు సొచ్చి వెల్వడు నట్టిచోటు గాన
కహిత మృగములచే నొండె నాత్మభృత్య । దావపావక పటుశిఖాతతుల నొండె
రీతిఁ జెడుఁగాని మఱి సేకరించ లేఁడు । శౌర్యగుణధామ మృగకుల సార్వభౌమ.

వ. అని చెప్పినఁ బింగళకుం డిట్లనియె సంజీవకుండు నాకుఁ బ్రతికూలుండై కీడు సేయ సమర్థుండగునే యనిన దేవర కవ్విధంబు మున్న విన్నవింపవలసినవాఁడనై యుండియు మంత్రభిన్నంబైనఁ గార్యంబు దప్పునని శంకించితి మంత్రం బతిప్రయత్న రక్షణీయంబు గావలయు విజ్ఞాత శీలాచరణుండగు శాత్రవు విశ్వసించి మఱుమఱచిన నతం డేమి సేయనోపండు విజ్ఞాత శీలాచరణంబగు డిండికంబు చేతంగాదె మందవిసర్పిణి మృతింబొందెననుటయుఁ బింగళకుండు తత్కథాక్రమం బెట్లనుటయు నతం డిట్లనియె.

క. మందవిసర్పిణియను నా । నందయుతోఁ జీరపేను నరపతి శయ్యం
బొందుగొని పెద్దకాలం । బెందుంబోక చటనుండు నిష్టమెలర్పన్. ౨౫౪.

క. అచ్చోటికి నొక తెఱఁగునఁ । బ్రచ్ఛఱ నరుదెంచి డిండికంబను నామం
బచ్చుపడిన నల్లి మదిం । బొచ్చెము లేకనియె యూకపుంగవుతోడన్. ౨౫౫.

శా. నీపాదంబుల కేను మ్రొక్కెదఁ దగన్నీవాఁడ నీచుట్టమం
గాపాలందగు నన్నయూక మకటా కైవార మింతేటికిన్
నాపుణ్యంబున వచ్చితిచ్చటికి ధన్యంబయ్యె మద్వంశ మీ
భూపశ్రేష్ఠుని పాన్పునందు సుఖినై పూజ్యుండనై తింజుమీ. ౨౫౬.

వ. అని మఱియును. ౨౫౭.

క. నన్నేమి యడుగుకొఱకై । సన్నుతగుణ ప్రియము చెప్పఁ జనుదెంచితి నా
యున్నయది హీనవృత్తము । కన్నారఁగఁ జూచి యేమి కాంక్షింతువనా. ౨౫౮.

వ. అనిన నమ్మాటకు డిండికాఖ్యంబగు మత్కుణం బిట్లనియె. ౨౫౯.

సీ. కలిమిలేములు చూచి కాంక్షించునాయర్థి తనకు నక్కఱయైనఁ దగులుఁగాక
యితఁడు లోభి వదాన్యుఁడితఁడని యెఱుఁగునా యర్థంబు కాంక్షఁ బెల్లఱచుఁగాక
హీనాధికంబుల నెఱిఁగి యాచించునా లేమికై యొరులఁ గారించుఁగాక
విద్యలేదని తన్ను వివరింప నేర్చునా సభలవిత్తాపేక్ష జదువుఁగాక
తెల్లబట్టల వార్వెంట నెల్లఁ దిరిగి । తనకు నేర్చిన నడుగంగ దాత మెచ్చి
యర్థమిచ్చిన నలరు లోభానుకూల । చిత్తుఁ డీకున్న నంతటఁ జిన్నపోవు. ౨౬౦.

వ. అని పలికి డిండికుండు వెండియు నిట్లనియె. ౨౯౩.

గీ. అర్థి తారతమ్య మడుగంగఁ జెప్పితి । నర్థకాంక్ష నిన్ను నడుగ రాను
మిత్ర! నాకు నశనమాత్ర మింతియ నీవు । చేయవలయు నట్టిసాయ మెల్ల.
మానకమున్న నేఁ జెనఁటి మానవరక్తముఁ ద్రావుచుండుదుం
గాని మహీశుదేహమునఁ గల్గినశోణిత పానఁ గానమిన్
మేనెరియంగనుండి నిను నేఁడు గనుంగొన నిందువచ్చితిన్
దీనికి నీయకొమ్మిటు మదీయ మనఃప్రమదంబు చెల్లఁగన్. ౨౯౪.

వ. ఇవ్విధంబున నుష్ణాహ్వారిన కారణం బెట్టిదేని. ౨౯౫.

సీ. శాల్యన్నఘృతసూపశాక భక్ష్యములతో వాసనగల రసావళులతోడ
బహుఫలంబులుగల పానకంబులతోడఁ గమనీయ మాంసఖండములతోడ
మధురేక్షు గోక్షీర మధుపానములతోడ సరసంబులైన పచ్చళ్ళతోడ
సుమనోజ్ఞ దధితక్ర శుద్ధజలములతోఁ బరిమళ గంధపుష్పములతోడఁ
జతుర శృంగారవతులైన సతులతోడ । ననుదినంబును భోగించు నవనిపతుల
దేహరక్తంబుఁ గ్రోలంగ నూహ చేసి । తిరుగుచుండుదుఁ గాని సిద్ధించ దెందు.

వ. అన డిండికంబు పలుకు లాకర్ణించి కటకటంబడి మందవిసర్పిణి యిట్లనియె.

చ. చలనములేక యీనృపతి శయ్య నహర్నిశమున్ సుఖించు నా
మెలఁకువ హానిచేయుటకు మేకొని రాఁదగునయ్య ద్రోహకా
రులు సుజనాపకారములు రోయుట నైజముగాన నీకు నే
నలుగుదుఁగాని యించుకయు నాత్మ నొడంబడ మత్కుణోత్తమా. ౨౯౬.

వ. అనిన మందవిసర్పిణికి డిండికుం డిట్లనియె. ౨౯౭.

క. నీదగు నెలవున నాకుం । గాదవు నన బలిమిలేదు కరుణాన్విత నీ
పాదముల కేను మ్రొక్కెద । వాదడవక సమ్మతింపవలెనన నదియున్. ౨౯౮.

వ. దాక్షిణ్యంబు కతంబున నొడంబడి యిట్లనియె. ౨౯౯.

క. వెరవెఱిఁగి వేగిరింపక । సురత శ్రమపారవశ్య సుఖసుప్తి మెయిన్
బారసిన ధరణీకాంతుని । వరదేహం బొయ్యఁగఱచి వలయుఁదొలంగన్. ౩౦౦.

క. కక్కుఱితి కాఁదు కార్యము । చక్కటి యెఱుఁగండు సంధ్యాజామున నతనిన్
బొక్కపడ నీవు కోఱల । నొక్కిన నది తెలియ మన కనువుదప్పుఁజుమీ. ౩౦౧.

గీ. అనిన నట్లకాకయని నల్లియును జీర । పేను నేకశయ్యఁ బ్రీతినుండఁ
బేనుకన్ను మొఱఁగి ప్రియపడి భూమీశుఁ । గదిసి సందెజాము కఱచెనల్లి. ౩౦౨.

వ. అప్పుడమ్మహీపతి నిద్రావిరహితుండై యుండుటం జేసి యదరిపడి తన పదతలంబు లొత్తుచున్న యనుచరుల నాలోకించి యిట్లనియె. ౩౦౩.

ఉ. దీవియఁ దెచ్చి చూడుఁడు మదీయ శరీరము తేలుకుట్టి స
ల్లే వెతపొందెడుం గడురయంబున రండన వారు వచ్చి నా
లో వివరాంతరంబున కులోఁగిన మత్కుణనాథుఁ గాన కా
భూవరు పాన్పుమధ్యమున బొందిన మందవిసర్పిణిం దగన్. ౩౦౪.

క. పొడగాంచి యిదియెకతి చెం । బుడమి ధవుని దేహమునఁ జుఁ బొడవడఁగింపన్
మడిసెను మందవిసర్పిణి । కడు దుర్జనుపొందు హానిగా కేలుండున్. ౩౦౫.

వ. అని యిట్లు దమనకుండు చెప్పిన విని పింగళకుండు నా పరాక్రమం బెఱింగియు సంజీవకుఁ డెట్ల్యో సాధనంబుల నన్ను సాధించువాఁడనుటయు నతం డిట్లనియె.

ఉ. కొమ్ముల గ్రుచ్చి యెత్తియును ఘోర ఖురాగ్ర నిపాతనంబులన్
జిమ్మియు దంతఘాతములఁ జించియు వాలవిశాలచాలనో
గ్రమ్ముల నెమ్ము లెల్లఁ గడిఖండలుగాఁ జదియంగ మోఁదియున్
సమ్మదమారఁ జించు మృగసత్తము యేమఱియుండితేనియున్. ౩౦౬.

వ. అనిన విని పింగళకుం డొక్కింత చిత్తక్షోభంబుగా దమనకుం జూచి నీ వింతట నరిగి యా వృషభనాయకుని యభిప్రాయం బెఱింగి శీఘ్రింబ రమ్మన్న వాఁడును నంతంత నాడుఁగుచుఁ జకితుండునుంబోలె సంజీవకుం జేరంబోయిన నతం డిది యేమి భయకంపితుండవగుచుఁ జనుదెంచితివి కుశలంబకదా యసిన సేవకధర్మంబునం దిరుగు వారికి సంసారసుఖంబుగలదే వినుమని యిట్లనియె. ౩౦౭.

ఉ. ఇంతటివానిఁ జేసి నృపుఁ డింతధనం బొసఁగూడెఁ బత్యమ
త్యంతము నాపయింగల దయత్న సుఖానుభవంబు దీర్ఘకా
లాంతరసంచితంబని నిజాత్మఁ దలంచును బాలిశుండు ప్రా
ణాంతముగాఁ దలంచి చలితాత్మతనుండు వివేకి యిమ్మహిన్. ౩౦౮.

వ. అనిచెప్పి మఱియును. ౩౦౯.

సీ. ధనవంతు గర్వంబు దాకొనకేలుండు వ్యసనికాపద యేల పాసఁగకుండు
సతులఁజూచిన మతి చలియింపకేలుండు నృపులమన్నన లేల నిజములగును
గాలంబుచే రూపుకడచనకేలుండు గౌరవమర్థికే కరణిఁగలుగు
దుర్జనవాగురఁ దొడరకెవ్వఁడు నిల్చుఁ జిరకాలసుఖము నేనరుఁడుపొందుఁ
గాని గుణములు విడిచి పుణ్యానుకూల । వర్తనంబుల నిహపర వైభవములఁ
బొందువాఁడొక్కఁడొక్కఁడు పుణ్యపురుషుఁ । డతఁడు దేవాంశజనితమహాత్ముఁ డంద్రమ.

వేముగంటి - దత్తోజీపండితుఁడు.

ఈ కవి ప్రస్థానత్రయములో నొకటియైన భగవద్గీతా యోగశాస్త్రమును బద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు హరితసగోత్రుఁడు; నాగమాంబకును నాగోజీ పండితునకును బుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; మాధ్వమతస్థుఁడని తోఁచుచున్నది. ఈయన కాలము మొదలగునవానినిగూర్చి యేమియు నిశ్చయముగాఁ దెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు కాఁడు. కృష్ణార్జున సంవాదమను నామాంతరము గల యీ యోగశాస్త్రములోని కొన్నిపద్యముల నిందు దాహరించుచున్నాను—

ఉ. కోకలు జీర్ణమైన నఁగ గొబ్బున వానిఁ బరిత్యజించి తా
శ్రీకర నూత్నవస్త్రములఁ జెల్వుగఁ దాల్చినభంగి దేహి యను
శ్లోకుఁడు జీర్ణదేహముల శోభ దరోసిన జీవమూర్తి యీ
లోకపుఁ గోమలాంగముల లోలతఁ దాల్చును భద్రమూర్తియై.— అధ్యా. ౨.

ఉ. సల్లలితంపుఁ గర్మములు సాంద్రయశోనిధి సద్విరక్తిచే
నెల్లను సన్యసించి పటుయోగసుఖంబునఁ జెందుచుండుఁ దా
నెన్నెడ జీవుఁబోలి కడుహేయపుఁ దొమ్మిదితూంట్లమేనిలోఁ
బ్రుష్లుచుఁ జేయనొల్లఁడు ప్రతోషముతో నియమింపఁ డన్యులన్.— అ. ౫.

ఉ. వేదములన్ మఖంబులను విశ్రుతదానతపంబులన్ సము
త్పాదితమైన పుణ్యము నథఃకరణం బొనరించు యోగి య
య్యాదిమ పూరుషోత్తము నిజార్థము నెమ్మది సంగ్రహించి ని
ర్వేదనలేక యహార్యమగు విష్ణుపదంబును జెందు నర్జునా.— అ. ౮.

ఉ. ఇంద్రియ సౌఖ్యసంపదల నేమియుఁ గోరక వీతరాగుఁడై
సాంద్రయశుం డహంక్రియల చక్కటిఁ బోవక దూరవర్తియై
యింద్రజ మేనికిన్ జరయు మృత్యువు జన్మము వ్యాధులున్ విని
స్తంద్రత దుఃఖదోషములుఁ జాలఁగఁగల్గు దెలుంగఁగాఁ దగున్.— అ. ౧౩.

ఉ. కామము రాగముం జలముఁగల్గి యహంకృతి దంభయుక్తుఁడై
యేమనుజుండు శాస్త్రవిధి నెంతయుఁ దుచ్ఛముగాఁ దలంపుచున్
భూమికి భీకరంబయిన భూరితపం బొనరింపుచుండు నా
పామరు నాసురక్రియలఁ బర్వినవానిఁగ నిశ్చయింపుమా.— అ. ౧౭.

గుడారు - వేంకటదాసకవి.

ఈకవి బలరామచరిత్రమని సామాన్యముగా వాడఁబడు ప్రబంధరాజ శిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్ర యను నాఱాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు బలిజవంశజుఁడు; పైడిపాలగోత్రుఁడు. ఈతని తండ్రి గురవేంద్రుఁడు; తల్లి రంగమాంబ. ఇతఁ డాధునిక కవియే యయినను, కాలనిర్ణయముచేయుట కాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండెనేమో! ఈతని కవిత్వము ప్రౌఢమైనది. బలరామచరిత్రమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. నీరేజాక్షికి హారమౌక్తికములట్ నీలంబులై తైలముల్
జాలంగాఁ బగడంబులై పిదప వజ్రాకారములూని వి
స్తార స్వేదకణంబులం దడిసి సున్నంబయ్యె నాదుర్గమ
స్మారస్ఫారశరాగ్ని హైమపటమచ్ఛచ్ఛాయమై తోఁచినన్.— ఆ. ౩.

ఉ. వారిధి ధీరమానసుఁ డవారితతేజుఁడు నైజరాజకం
ఠీరవ భావభీత హరిణీభవ దున్మదవైరి వీరుఁ డు
ద్దారుణమార్గణ ప్రకరదైన్య విదారణ దానదక్షుఁ డీ
భూరమణాగ్రణిం గనుము పుష్కరనేత్రి విదూరకాహ్వయున్.— ఆ. ౫.

తురగా - రామకవి.

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్లును, అడిదము సూరకవితోడి సమకాలికుఁడయినట్లును, ఎల్లవారును వాడుచున్నారు. వేములవాడ భీమకవికిఁ దరువాతఁ దిట్టుకవిత్వమునం దీతనితో సమానుఁడు మఱియొకఁడు లేఁడు. భీమకవివలెనే యితఁ డాడినమాట యెల్ల నగుచువచ్చెననియు, అందుచే నెల్లవారు నీతనికి జడియుచు వచ్చిరనియు, చూపుట కనేక కథలు కల్పింపఁబడినవి. అందుఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

౧. ఈకవి లేటవరపు పోతురాజను క్షత్రియునియింటికిఁ బోఁగా నతఁడు కవి కేమయిన నియ్యవలసివచ్చునని యింటనుండియు లేఁడనిపించెనఁట. అప్పుడు రామకవి

క. కూటికిఁ గాకులు వెడలెను। నేటావల మూఁకచేరె యేడువఁ దొడఁగెన్
గాటికిఁ గట్టెలుచేరెను। లేటవరపు పోతురాజు లేఁడా లేఁడా?

అని ప్రశ్న వేయునప్పటికిఁ బోతురాజు మృతుఁడయ్యెనఁట! దహనము నిమిత్తమయి బంధువు లింటినుండి శవమును గొనిపోవుచున్నప్పు డాతని భార్యలువచ్చి కవికాళ్లమీఁదఁ బడి పతిభిక్ష పెట్టుమని వేఁడుకోఁగాఁ గరుణించి

క. మేటి రఘురాముతమ్ముఁడు । పాటిగ సంజీవిచేత బ్రతికినరీతిన్
గాటికిఁబోనీకేటికి । లేటవరపు పోతురాజ లెమ్మా రమ్మా.

అని కవి పిలువఁగానే మరల బ్రదికిలేచి పోతురాజు కట్టుకుమీఁదనుండి దిగివచ్చెనఁట!

౨. ఈకవి బావమైన తల్లాప్రగడ సూర్యప్రకాశరాపు ఉంగుటూరను స్వగ్రామమునం దొక పెద్దయిల్లుకట్టించి, దానిని జూపుటకయి కవిని లోపలికిఁ దీసికొనిపోయి యొక గదిలో విడిచి బావమఱఁది పరియాచకమునకయి తాను మఱియొకచోట దాఁగి యుండెనఁట. కవి యాయింటఁ దిరిగి తిరిగి దారి కనుఁగొనలేక విసిగి

గీ. అంగణములెన్ని కేళిగృహంబులెన్ని । యో[illegible]బిళ్లల యిండ్లెన్ని మేడలెన్ని
కట్టఁగాకేమి సూర్యప్రకాశరాయఁ। డుంగుటూరిండ్ల రాకాసులుండవచ్చు.

అనఁగానే కాపుకావని యఱచుచు నింట నేమూలఁజూచినను దామేయయి పట్ట పగలు పిశాచములు సంచరింపఁ జొచ్చెనఁట.

౩. పెద్దాపురపు సంస్థానాధీశ్వరులయిన శ్రీవత్సవాయి తిమ్మజగపతి మహారాజు గారి దర్శనార్థముపోయినప్పుడు రాజు కవికి దర్శనమియ్యకపోఁగాఁ గోపించి

క. అద్దిర శ్రీభూనీళలు । ముద్దియలాహరికిఁ గలరు ముపురందులలోఁ
బెద్దమ్మ నాట్యమాడును । దిద్దిమ్మని వత్సవాయి తిమ్మనియింటన్.

అని శపింపఁగానే రాజు రాజ్యమును బోఁగొట్టుకొని దరిద్రుఁడయ్యెనఁట!

౪. రామకవి యిల్లుకట్టించుకొనునప్పుడు దారిని బోవువారి నందఱిని బిలిచి తనగోడ కిటుక లందిండని నియమించుచుండెనఁట! ఒకనాఁ డాదారిని అడిదము సూరకవి పోవుచున్నప్పు డాతనిని బిలిచి తక్కినవారి నడిగినట్లే యతనిని గొన్ని యిటుక లందిచ్చిపొమ్మని యడుగఁగా నతఁడు కోపించి రామకవియని యెఱుఁగక

"సూరకవి తిట్టు కంసాలి సుత్తెపెట్టు"

అని పలికి పోఁబోయెనఁట! రామకవి యామాట విని కన్ను లెఱ్ఱచేసి బిగ్గరగా

"రామకవి బొబ్బ పెద్ద పిరంగి దెబ్బ"

అని కేకవేసెనఁట. అంతట సూరకవి యతఁడు రామకవియని తెలిసికొని కొన్ని యిటుక లందిచ్చి మఱి వెడలిపోయెనఁట!

ఇవి యన్నియుఁ గేవల కల్పితకథలయి యుండవచ్చును. ఇటువంటి మహా మహిమగలవాఁడన్న వేములవాడ భీమకవి కోమటిపేరఁ గృతిచేసి స్తుతించినట్లే యీ

రామకవియుఁ గంసాలి సేరఁ గృతిచేసి స్తుతులు చేసెను. ఈతఁడును నయ్యంకి బాల సరస్వతి యను మఱియొక కవియుఁ గలిసి రచియించిన నాగరఖండమనెడి మూఁడాశ్వాసముల గ్రంథ మొకటి కానఁబడుచున్నది. ఈ యిద్దఱు కవులును దమ గ్రంథము యొక్క యాశ్వాసాంతగద్యము నీప్రకారముగా వ్రాసికొనియున్నారు—

"ఇది శ్రీమద్దుర్గా దక్షిణామూర్తి వరప్రసాదాసాదిత సారస్వత తురగా రామకవి వరాయ్యంకి బాలసరస్వతీ నామధేయ ప్రణీతంబైన శ్రీ స్కాందంబను మహాపురాణంబునందు సనత్కుమార సంహితను నాగరఖండము."

ఈ నాగరఖండము భవశేశ్వరపు మార్కండేయుఁడను స్వర్ణకారకులజుని కంకితము చేయఁబడినది. ఈ విశ్వకర్మవంశజుఁడు బెజవాడకుఁ బ్రభువుగానుండిన ట్లీ క్రింది పద్యమువల్లఁ దెల్లమగుచున్నది—

మ. రజతాగంబాకరాజమౌళికి విని ర్మాణంబు గావించి యి
చ్చె జగంబెన్నఁగ విశ్వకర్మ యును దాఁ జిత్రంబుగా దిష్వడీ
బెజవాడ ప్రభుఁ డియ్యనెంతయును గల్పించుకా ధరిత్రికా మహా
రజత స్వర్ణగృహంబు లెప్పుడు బుధవ్రాతంబు మోదింపఁగన్.

ఈ భవశేశ్వరపు మార్కండుఁడు మహమ్మదు కుతుపశాహి కాలములో నుండినట్టు నీ నాగరఖండము యొక్క యవతారికలో నీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

క. అతఁడు ప్రసిద్ధివహించెన్
క్షితి నగరజపతులగెల్చి చెలఁగి జయశ్రీ
సతిఁ జేకొనిన మహమ్మదు
కుతుపశహాచంద్రునకును గుడిభుజమనఁగన్.

దీనినిబట్టిచూడఁగాఁ గవి పదునాఱవ శతాబ్దాంతమునందో పదునేడవశతాబ్దారంభమునందో యుండినట్టును, కవినిగూర్చి చెప్పెడు కథలన్నియు నబద్ధములయినట్టును, కనఁబడుచున్నది. మహమ్మదు కుతుబుషాహి క్రీస్తుశకము ౧౫౮౧ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧ వ సంవత్సరము వఱకును గోలకొండ నబాబుగానుండి రాజ్యము చేసెను. కుతుబ్‌షాహి వంశము ౧౬౮౭ వ సంవత్సరముతోనే నశించినది. కాఁబట్టి యీకవి ద్వితీయభాగములోఁ జేరవలసినవాఁడే యయినను, ఈ విషయము నింకను విచారింపఁదలఁచి ప్రస్తుత మీతని నాధునిక కవులలోఁ జేర్చుచున్నాము. నాగరఖండమునందుఁ గొన్ని వ్యాకరణ విరుద్ధములగు ప్రయోగములున్నను మొత్తముమీఁదఁ గవిత్వము హృద్యముగానే యున్నది. నాగరఖండమునుండి కొన్ని పద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. ప్రీతియొనర్ప నగ్గిరి నిరీక్షణమొనర్ప దరీసరత్ప్రపం
చీతట జాతరూప ధరణీ రమణీమణీ సమగ్రమై
స్ఫీతసుధాంబు పూరసగనీరుహశీకర శీతలానిలా
న్వీతవిహార దేవతరుణీ హరిణీ కరిణీ సమూహమై. — ఆ. ౧.

ఉ. ఆదికి నాదికారణ మహర్పతికోటి సమాన తేజుఁడు
త్పాదిత సర్వలోకుఁడును బ్రహ్మమునైతగు విశ్వకర్మ నా
నాదివిజాళిలోన భువనంబుల నెల్లను హేతుకార్య క
ర్త్రాదులు తానయైతగు యథార్థము నమ్ము మయూరవాహనా. — ఆ. ౨.

ఉ. ఇచ్చిన నైదుసాధనము లింపుగ నైదుగురుల్ ధరించి యు
ద్యచ్చరిత ప్రశస్త యజనాదిరతుల్ శివతత్త్వబోధులై
యచ్చెరువందఁ జేసిరి సమస్త జగంబులఁ దక్షణంబునన్
మెచ్చిన యాత్మవర్తనల నెన్నికగాఁగ సరోజబాంధవా. — ఆ. ౩.

చ. కమలజుకంటెమున్న శశిఖండ శిఖామణికంటె మున్న శ్రీ
రమణునికంటె మున్నగ విరాజిలు బోధకుఁడైన యట్టి బ్ర
హ్మముగ మహాప్రభావుఁడని యాత్మ వివేకముచే నెఱుంగుమా
యమితపు విశ్వకర్మను మహాత్ముని లోకకృతి ప్రవీణునిన్. — ఆ. ౪.

చ. కడఁకఁ గనుంగొనంగఁ దొలుకారు మెఱుంగులు గ్రుమ్మరింపఁగా
నడుగిడ గల్లుగల్లుమను హంసకనాదము హంసరావమున్
వడఁబడఁ బద్మరాగ సముదాయము దాపున నేపుచూపి యొ
ప్పెడలఁ బదాగ్రరాగరుచు లీనఁగ వచ్చెను గౌరివేదుకన్. — ఆ. ౫.

వేమనారాధ్యుల - సంగమేశ్వరారాధ్యుఁడు.

శైవుఁడయిన యీ కవి యహల్యాసంక్రందన విలాసమనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఒక యెత్తుగీతములో

గీ. అట్టి సాహస విక్రమారాంకుఁడైన । వాసిరెడ్డ్వన్వయాంభోధి వరవిధుండు
చంద్రమౌళి క్షమాపాల జనవిభుండు । కొలువుదీరి మహోత్సాహకుంతగరిమ

అని కవి వాసిరెడ్డి చంద్రమౌళి ప్రభువు తన్నుఁ బిలిపించి వేఁడఁగా తా నహల్యాసంక్రందన విలాసము నా రాజమౌళి కంకితము చేసినట్లు చెప్పెను. ఈ వాసిరెడ్డి చంద్రమౌళి కృష్ణామండలములోని యమరావతీపురమును బరిపాలించిన కమ్మ వంశ

జుఁడు. ఇతఁడు సుప్రసిద్ధుఁడయిన వాసిరెడ్డి వేంకటాద్రినాయని సోదరపుత్రుఁడు. ఈకవి కవిత్వము ప్రౌఢమయినది కాని యిందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈ గ్రంథము నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁ బడినది. అహల్యాసంక్రందన విలాసమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. పరకాంతారతి దోషమంచు మది సంభావింపఁడో యన్యులె
వ్వరు గన్నం దను నిందసేతురను భావంబెంతయుం బూనఁడో
వరుఁ డొక్కింత యెఱింగెనేని సిలుగుల్వాటిల్లునం చెన్నఁడో
పరమామోదమె కాని యింద్రునకుఁ బాప భ్రాంతిలేదేమియున్.— ఆ. ౩.

చ. సరిసరి! నిన్నువంటి నెఱజాణలు పుట్టరె? వారలెల్ల నీ
కరణిఁ దలంతురే? చిఱుతకార్యము లిచ్చటఁ జెల్లునే? యయో
పరమ పతివ్రతైన మునిభామినితో నెకసక్కెమేమి? నీ
గరిమను గానవచ్చె నిదికాదనరో వినరో బుధాగ్రణుల్.— ఆ. ౫.

ములపాక - బుచ్చన్నశాస్త్రి.

ఈకవి వేంకటేశ్వర మాహాత్మ్యమను పద్యకావ్యమును రచియించెను. ఇతఁడు కోనసీమద్రావిడబ్రాహ్మణుఁడు. ఈ బ్రాహ్మణులనే యారామద్రావిడులనియు, పేరూరియఱవలనియు, వాడుదురు. వీరు మొట్టమొదట నఱవవారేయయినను చిరకాలము క్రిందటనే యీ యాంధ్రదేశమునకువచ్చి తోఁట దొడ్లను సంపాదించి యిచ్చటనే నిలిచిపోయినవారగుటచే నఱవభాషను మఱచిపోయి యించుమించుగాఁ దెనుఁగు భాషనే స్వభాషనుగాఁ జేకొనియున్నారు. వీరు తెనుఁగున గ్రంథరచన చేయుటయే యీ విషయమును దెలుపుచున్నది. ఈకవి కోదండరాముని పుత్రుఁడు; భార్గవ గోత్రుఁడు; గుండ్లూరియందుండినవాఁడు. ఇతఁడు తన పూర్వులనుగూర్చియు, తన్నుఁ గూర్చియు, వేంకటేశ్వర మాహాత్మ్యమునం దిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అనుపమ కోనసీమాభిధాన ద్రావిడాన్వయంబునను విఖ్యాతిమీఱ
ములపాకవారను ముఖ్యాన్వవాయులు కాశ్యప భార్గవ కౌశి కాత్రి
గోత్రజు లలరందు గురుతర భార్గవగోత్ర సంజాతుఁడై కొమరుమీఱ
వేంకటపతి వాని కుంకుమమీఱ వెంగాంబికయందు సుబ్బాభిధాన

విబుధవరుఁ డుద్భవించె నవ్విమలమతికి । బుచ్చమాంబికయందు సంపూర్ణచంద్ర
మండలమురీతి సత్కళా మండనుండు। రహిఁ జనించెను గోదండరామవిభుఁడు.

❊ ❊ ❊ ❊

సీ. మట్లి వంశోద్భవక్ష్మాపాల పాలిత గుండ్లూరి పురినుండు గురుయశుండ
నాంధ్ర గీర్వాణభాషాష్టభాషా కవిత్వాభి నిర్మాణ మహత్వవిదుఁడఁ
గాశికా విశ్వేశ కరుణాకటాక్షాభి భాషిత బహుళ ప్రబంధచయుఁడ
హితనాటకాంత సాహిత్య నిత్యాభ్యస్త సకలపురాణార్థసారవిదుఁడ
సాంద్ర ములపాక విద్వత్కవీంద్రవంశ । వార్ధి చంద్రుండ సర్వసర్వంసహాభి
విశ్రుత కుకవికులగోత్ర విపులపవి । శాతపవియైన బుచ్చనశాస్త్రికవిని.

ఇతని కాలము తెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల పయివాఁడయియుండును. వేంకటేశ్వర మాహాత్మ్యమునుండి మఱి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సంగతిమీఱ మీ చరణసారసమందు జనించినట్టి యా
గంగకు దక్షిణంబున నగాధతరంబగు దక్షిణాబ్ధికిన్
రంగగు నుత్తరంపు దెస రాజిలు పూర్వసముద్ర పశ్చిమా
శంగన నొక్కతావమరు సారతరోన్నత దండకాటవిన్.— ఆ. ౧.

చ. గిరిజయు నీవు నెల్లపుడుఁ గిన్నర పన్నగ సిద్ధ సాధ్య భూ
సుర నరసంఘము ల్గొలువ సొంపు దలిర్పఁగఁ జేరి యీ సరో
వర తటసీమనుండుఁ డభివర్ణన కెక్కు భవత్సమాఖ్య ని
గ్గిరియు సరోవరంబుననుఁ గేవల మోదముతో హరుండనన్.— ఆ. ౧.

మల్లవరపు - వాలేశ్వరుఁడు.

ఇతఁడు భల్లాణ చరిత్రమను నైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. సింధు కటకరాజయిన భల్లాణుఁడు జంగము లడిగినదెల్లనిచ్చు భక్తిచూపుచుండెనఁట! ఆతని భక్తిని పరీక్షింపవలెనని శివుఁ డొకనాఁడు జంగమువేషముతోవచ్చి తనకుఁ బతివ్రతయగు యువతి కావలెనని యడుగఁగా, రాజు తన పట్టణమునం దట్టిస్త్రీ దొరక నందునఁ దన భార్యయగు చెల్లమ్మనే యా జంగమున కర్పించెనఁట! శయన గృహమున కేగినప్పుడా జంగమయామె నంట సందేహపడుచుండఁగా, చెల్లమ్మయే ముందుకుఁబోయి యా యతిథిని కౌఁగిలించుకొనునప్పటి కతఁడు మూఁడునేత్రముల శిశువయ్యెనఁట!

అంతట నా దంపతు లతఁడు శివుఁడని తెలిసికొని యారాధింపఁగా, ఈశ్వరుఁడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి వారికి ముక్తి నిచ్చెనఁట!

వాలేశ్వరుఁడు పాకనాఁటి నియోగియగు శైవబ్రాహ్మణుఁడు; గౌతమసగోత్రుఁడు; పోలయామాత్య పుత్రుఁడు. ఇతఁడు తన గ్రంథమును మల్లవరపు నాగేశ్వరస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁగూర్చి భల్లాణచరిత్రమునం దిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. అనఁబాడఁ జదువఁ జెప్పను నేర్పు సర్వజ్ఞభోజుండు మా తాత పోతరాజు
బహుపురాణజ్ఞుండు బాంధవాశ్రితకల్పభూజంబు మాతండ్రి పోలమంత్రి
పరమశాంతుఁడు కృపాపాథోధి మాపినతండ్రి విరూపాక్షదండనాథుఁ
డఖిలవిద్యానిధి యర్థార్థితతిఁ బ్రోచు మా తత్సుతుఁడు సదాశివుండు
సేవితర్కింప వరకవితావిశేష। విదితుఁడను ప్రాఁకనాఁడింటివాఁడ శుద్ధ
శైవుఁడను గౌతమసగోత్రసంభవుండ। నెంచఁదగు మల్లవరపు వాలేశ్వరుండ.

❋ ❋ ❋ ❋

మత్తకోకిల. సన్నుతంబగునట్టి వేల్పు ప్రసన్నుఁడై మముఁ బ్రోవఁగా
చిన్నకోట విలాతిలోఁగడు వేడ్క మల్లవరంబునన్
బన్నగేశ్వర సుప్రతిష్ఠను భక్తరక్షణ చేయుచున్
వన్నెమీఱఁగ నాగలింగమనన్ వసించు మహోదయున్.

ఈకవి నివాసస్థలము కృష్ణామండలమునందలి చిన్నకోట సీమలోని మల్లవరమయినట్టు పయిపద్యమువలననే విస్పష్టమగుచున్నది. కవి యెప్పటివాఁడో నిశ్చయముగా తెలియరాదుగాని యిన్నూఱు సంవత్సరముల క్రిందటివాఁడయినట్టు కనుపట్టుచున్నాఁడు. భల్లాణ చరిత్రములోనివి రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. భువి రుద్రాక్షను నెవ్వరేని మది శంభుం డంచు భావించుచున్
జెవులన్ వక్షమునన్ శిరస్స్థలమునన్ జేదోయిఁ గంఠంబునన్
వివరింపంగ ధరింతు రాజనులకున్ వీక్షింపఁగా సాటిలే
రు విరించ్యంబుజనాభ కిన్నర మరుద్యక్షేంద్ర లోకంబులన్.— ఆ. ౨.

ఉ. కప్పురవీడెమున్ నొసటఁ గస్తురిబొట్టును జెంద్రకావియా
దుప్పటి పల్లెవాటు కలదో మఱి లేదొ యనంగఁ జాలసైఁ
జిప్పిలు భూతిలేపనముఁ జేతను సన్నపుగౌరిబెత్తమూ
దొప్పుల కుప్పరూపును మహోన్నతియు న్విలసిల్లఁ జెల్వుగన్.— ఆ. ౪.

టనే మహారాజుగారతని కెదురుగాఁ బోయి కౌఁగిలించుకొని చనిపోయినఁడవు మఱల వచ్చితివని తాము విన్న వృత్తాంతమునంతను బూసగ్రుచ్చినట్లు త్రివిక్రమునికి మహారాజుగారు నివేదించిరి. తరువాత త్రివిక్రముఁడును నానందబాష్పములు స్రవింపఁ దిన్నఁగా మహారాజుగారితో న్యాయాధికారి కచేరి కేగెను. అక్కడనున్న యున్నతాసనముమీఁదఁ గూరుచుండి త్రివిక్రముఁ డటు నిటుఁ జూచుచు మహారాజుగారితోఁ దాను వచ్చినసంగతిఁ దెలుపుచు నింతలో నిదివరకు విమర్శింపఁబడిన నేరము వ్రాయఁబడియున్న కొన్ని తాటియాకులను జూచి యది యామూలాగ్రముగాఁ జదివి వెంటనే పేఱొకమాటయైనఁ జెప్పక గుండెలు బాదుకొనుచు వధ్యస్థానమునకుఁ బరుగువాఱెను. మహారాజుగారది యేమని పెక్కువిధముల నడిగిరి కాని దానికిఁ ద్రివిక్రముఁడు ప్రత్యుత్తర మియ్యలేదు. ఈతఁ డట్లు వధ్యస్థానమునకై పరుగువాఱుచుండఁగా నీతని వెంటనంతటి రాజును న్యాయాధికారియు రాఁజొచ్చిరి.

అక్కడ నా నేరస్థుఁడు చంపఁబడువారు కూరుచుండు కొఱ్ఱుపైఁ గూరుచుండి తన సంగతి యాద్యంతములును విన్నవించి త్రివిక్రమ సీతమ్మలకొఱకు కొంతసేపేడ్చి చండాలురతో "నన్నిఁకఁ జంపుఁ" డనెను.

ఇంతలో నా మూఁకమధ్యనుండి యొక బాలుఁడు సుమారు పదునైదు సంవత్సరములవాఁడు వచ్చి "యే మందభాగ్యురాలి గొంతుఁ గోయవలెనని ప్రయత్నించి యీయన తుదకోడెనో ఆ మందభాగ్యురాలను నేనే. నా పేరు సీతమ్మ. ఈయన నాతండ్రి వెంకటేశ్వరుఁడు. ఈయనపై నేఁడు కల్పింపఁబడిన నేర మసత్యము" అని యాతనిఁ గౌఁగిలించుకొనెను. ఇంతలో నా మధ్యనుండి "త్రోవ, త్రోవ," యని యఱచుచు నొక ముసలి ముత్తైదువ వచ్చి "యేయమ గోదావరిలోఁ బడి చనిపోయినట్లూహింపఁబడెనో యా మందభాగ్యురాలను నేనే. నా పేరు లక్ష్మీదేవమ్మ. త్రివిక్రముఁడు, సీతమ్మ, రామారావున్నూ నాబిడ్డలు. ఆయన నాభర్త" అని యాతని మీఁదఁబడి యేడువ నారంభించెను.

ఇంతలోపలనే యొక బ్రాహ్మణసన్యాసి కొంచె మించుమించు యిరువదైదు సంవత్సరముల వయస్సుగలవాఁడు వచ్చి 'ఆబాలుఁడు నాభార్య. వీరిద్దరు మా అత్తమలు' అని వచ్చి వారిమీఁదఁ బడెను. ఇట వెంకటేశ్వరుని చుట్టును విజయనగరములోని జనులందరును మూఁగియుండి పురుషుని పురుషుఁడు వరించుట మొదలగు చిత్రములకు నిచటి విచిత్రములకు వెఱగుపడుచుండిరి. ఇంతలో దూరమునుండి "చంపవద్దు చంపవద్దు త్రోవ త్రోవ" యని మిక్కిలి వేగముతో కేకలువేయుచు నొక మనుష్యుఁడు

వచ్చి వెంకటేశ్వరునిపైఁబడి "ఇతఁడు నాతండ్రియే? యెవనిని నీతఁడు చంపె ననుకొని యనకీశిక్ష విధించిరో ఆ త్రివిక్రముఁడను నేనే" అని తల్లినిచూచి వెఱఁ పడి యొడలు తెలియక యేడువ నారంభించెను. ఇంతలో నొక బాలుఁడు "ఎం కాలమునకు మరల నాతల్లిని దండ్రిని యన్నను నక్కను జూచితిని" అని పరుగువా వచ్చి వీరిమీదఁ బడెను.

ఇంతలో మహారాజుగారువచ్చి యీ వృత్తాంతమునంతను విని యత్యాశ్చర్య ముతో మైమఱచి కొంతవడికి మరలఁ దెలివిఁదెచ్చుకొని వెంకటేశ్వరుని యురిశిక్షను మాన్పించెను. ఇంతలో విజయనగరము ముఖ్యామాత్యుఁడు చనుదెంచి తన కుమార్తెను త్రివిక్రమునికిచ్చి వివాహము చేసెద ననెను. వీరందరును త్రివిక్రముని మాటవలన న్యాయాధికారి కచేరీకివచ్చిరి. వెంటనే త్రివిక్రముఁడు తన తండ్రి నేరమును తాను విమర్శించెదనని మహారాజుగారితో మనవిచేయుగా వారందుల కంగీకరించిరి. త్రివిక్ర ముఁడును, నిరువురు జవానులను, పేరిసెట్టిని, పిలువనంపి అందఱిని వేఱువేఱు స్థలములలోనుంచి ముందు మొదటిజవానుతో

త్రి— ఈ హత్యజరిగి యెంతకాలమయినది.

జ— మహాప్రభూ. నేరము చేసినారము క్షమింపుఁడు.

త్రి— కాదు. నీవా బ్రాహ్మణుని జంప నెంచుట యుక్తమేనా.

జ— మహాప్రభూ! ధనమునకు లోభించి పేరిసెట్టిగారు చెరి నాలుగువేలు లంచమిచ్చెదమన్నందున ఒప్పుకొన్నారము.

త్రి— సరే! నీవు దూరముగానుండుము. (అని దూరముగాఁ దీసికొనిపోవుట కొక సేవకుని కనుజ్ఞయిచ్చి రెండవ జవానును పిలువనంపెను)

త్రి— ఏమోయి యీహత్య జరిగి యెంతకాలమైనది. ఉన్నది ఉన్నట్లు నీవు చూచినది చూచినట్లు చెప్పు. లేనిపోనివి చెప్పితే నీవు ఉరిదీయఁబడతావు. ఇదిగో యిందాకా నీవిచ్చిన వాఙ్మూలం.

జ— అయ్యా రెండునూసములక్రింద యీహత్య జరిగినదండి.

త్రి— అయితే ఊళ్ళో శవము కనఁబడి యెన్నాళ్ళయినది.

జ— అదీ రెండుమాసమ

త్రి— అయితే యిందాక

జ— లేదండి. రెండుమా

న్యా— ఛీ! అబద్ధమాడకు. నాలుగుమాసములని నీవు చెప్పలేదా.

జ— లేదండి.

మహా— వీణ్ని మిక్కిలి క్రూరముగాఁ దండింపవలెను. ఇందాక మీయెదుట ౨గుమాసములక్రిందట ననలేదా?

జ— చిత్తము మహాప్రభో! తప్పిదం చేశాను. పేరిసెట్టి దగ్గరనుంచి చెఱి నా ౨గువేలు తీసికొన్నాము మహాప్రభో. అంతట త్రివిక్రముఁడు వెంటనే వానిని దూరముగాఁ బంపివేసి పేరిసెట్టిని బిలువనంపి.

త్రి— పేరిసెట్టీ! నీవు యింతటి ఘోరకృత్యం చేయించడం చాలా చెడ్డది. ఇందువల్ల నీమీఁది కేమివచ్చేదీ తెలుసునా? ఆ బ్రాహ్మణుఁడు తప్పించుకొన్నాడు. ఆ నేరము నీమీదపడ్డని.

పేరి— నేనేమీయెఱుఁగ మహాప్రభో?

త్రి— నీవెఱుఁగకపోయినట్లయితే నీమనస్సునకైన తెలియునులే.

పేరి— మహాప్రభో! నేను మర్యాదస్థుఁడను. యెన్నఁడును యిటువంటివి చేసి యెఱుఁగను మహాప్రభో! నన్నడుగకుఁడు.

త్రి— నీవెఱుఁగవా.

పేరి— యెఱుగను.

త్రి—జవానులకుఁ జెఱి నాలుగువేలు యిచ్చి నీవు తప్పుసాక్ష్యము పలికించలేదా?

పేరి— లేదు.

త్రి— తీసుకురండోయి జవానులను.

(అంతట నలువురు సేవకులు యిరువురు జవానులను దీసికొనిరాగా)

త్రి— ఏమోయి! మీరు లంచంతీసికొన్నారా లేదా.

జ— తీసికొన్నాము మహాప్రభో! ఈయనవద్దనుంచి చెఱి నాలుగువేలు పుచ్చుకున్నాము.

త్రి— ఏమోయి పేరిసెట్టీ యేమంటావు దీనికి?

పేరి— స్వామీ? నాకేమి తెలియదు.

మహా— ఈ పేరిసెట్టి చాలా అబద్ధాలకోరు. అతనికి మేము ఉరిశిక్ష విధిస్తున్నాము.

పేరి—— మహా... మించవలెను. ఆ నేరము చేసినవాణ్ని నేనే. నన్ను ౨ంచాలి. నాపిల్లడికి చదువు చెప్పనందుకే యీపని చేశాను.

మహా— మొదటనే నీవొప్పుకున్నట్టయితే నీకీయిబ్బంది లేకపోయేది. ఇప్పుడు లాభంలేదు. మిగలా మాట అనేశాము. ఈ జవానుల కిద్దరికీ జీవితకాలం అంతా ద్వీపాంతరవాస శిక్ష విధించాము.

పేరి— ఇదంతా వినాయకరావు కుట్రండి. అతడిట్లా చేయమంటే చేసినానండి.

మహా — చేస్తే అనుభవించు?

అని వినాయకరావును పిలువనంపి అతనిని విచారించి అతనిని దేశమునుండి వెడలఁగొట్టిరి.

ఇంతలో కటకమునుండి విక్రమసేన మహారాజుగారు తాము స్వయముగానే రాజదర్శనము చేసికొనవలెనని బయలుదేరి విజయనగరము వచ్చిరి. మహారాజుగారును వారి నెదుర్కొని సభకుఁ దెచ్చి యచ్చోఁ త్రివిక్రముని వృత్తాంతము నతని తండ్రి వృత్తాంతమును చెప్పగా నది విని యాయన యచ్చెరువునొంది వెంటనే సీతమ్మ వృత్తాంతమును వినఁగోరెను. ఇంతలో లోపలినుండి యొక బాలుఁడువచ్చి తన సంగతిఁ జెప్పుచుండెను. విజయనగరమునందలి జనులందరు నక్కడ మూగియుండిరి. వారు వెనుక నొక బ్రాహ్మణుఁడా బాలుని తనభార్యయనుటయు, నాబాలుఁడు తాను స్త్రీననుటయు నిట్టి చిత్రములను గని దీని సంగతి నారయుటకై సీతమ్మ చరిత్రమును దత్తావధానులై వినుచుండిరి.

సీతమ్మయు దాను పుట్టినది మొదలుకొని నేఁటివరకును జరిగిన చర్యల నన్నింటిని వరుసగా నొకదానినైన విడువకుండఁ జెప్పుచుండెను. ముఖ్యప్రాణరావును వివాహము చేసికొనినతరువాత విజయనగరములోని పండితసభకై యామెయు భర్తయు బయలుదేరినతరువాత మార్గమధ్యమందు దొంగలు కొట్టిరనుమాట విను వరకు అచ్చటి జనులందరు విచారసాగరమగ్నులై చెఱఁబోయిన యామనిషి యెట్లు తప్పించుకొనెనో కనుగొందమని మఱింత శ్రద్ధతో వినుచుండిరి. సీతమ్మయు నిట్లు చెప్పుచుండెను.

అట్లు మార్గమధ్యంబున దొంగలపాలఁబడినతరువాత వారలు దయలేనివారి స్పృహలేక పడియున్న నన్ను గొనిపోయి నా శరీరమందలి నగల నన్నింటిని దోచుకొనిరి. ఆపిమ్మట నన్ను వారు చంపవలెనని ప్రయత్నముచేసిరి. కాని భగవదనుగ్రహమువలన నాదొంగల నాయకుఁడు నన్నుఁజూ [illegible] గాహము చేసికొన నెంచి తన యభిప్రాయమును నాకుఁ దెలిపి యొప్పుకొనక [illegible] ఖండించెదనని యొక కత్తి నటు నిటుఁ ద్రిప్పఁజొచ్చెను. అంతట నేను ఏవిధముగాఁ దప్పించుకొను నుపాయముఁ గానక మరణమునకు వెఱచి, కన్నులనుండి బొటబొట నీళ్లు గాఱుచుండ, నా నాయకునింగూర్చి విచారించుచు, వానితో “ఓరీ నేను బ్రాహ్మణకన్యకను. నాయందు దయయుంచుము. మనుజులలోఁ బురుషులను సోదరభావముతోను స్త్రీలను

దరీభావముతోనుజూడవలయును" అనియెన్ని చెప్పినను వాఁడువినక తోఁకఁద్రొక్కిన త్రాచువలె బుసకొట్టుచు నన్ను చంపవచ్చెను. అంతట విధిలేక నేను వానితో నాకొక వ్రతమున్నది. అది అయిన వెంటనే నిన్ను వివాహమాడెదను. నాకు ... దినములు గడువిండు. మీ ధైర్యస్థైర్య, గాంభీర్యాదులకును, సమయోచిత కైతవ వృత్తులకును గడు మెచ్చితి. మీ సామర్థ్యాతిశయాదులు నాకు వెఱఁగుబుట్టించుచున్నవి" అని యిట్లు నాలుగిచ్చకముల మాటలను జెప్పి వానికి సంతోషమును గలిగింపఁజేసి, ఆ దొంగల గుట్టెల్ల నెఱిఁగి తుదకు వారికిఁ దెలియకుండ నొకనాఁడు పాఱిపోయి తిన్నగా మధురవాడఁ జేరి అచ్చో నావేషమును మార్చుకొని పురుషవేషము వేసికొని యీ విజయనగరములో నాభర్త దొరకునని వచ్చితిని. కాని యెచ్చటను నాయన కానరాలేదు. ఆవెనుక నొక బ్రాహ్మణుని యింటికరిగి యచ్చో నొకయిల్లు నద్దెకుఁ దీసికొని యందు వసింపుచు, బాలురకు విద్యనేర్పుచు నా పంచప్రాణములను నాభర్త మీఁదనే యిడి నివసించుచున్నాను. నేను ఆకారమునుబట్టి యీ యురిదీయఁబడు వాఁతఁడు నాతండ్రియని గ్రహించి వీలయినపక్షమున నాతండ్రినిఁ దప్పించుటకై ప్రయత్నముసేయుచు నచ్చటికి వచ్చితిని. కాని యీయన తన కథ ముగించునంత వరకును నాతఁడు నాతండ్రియని యెఱుఁగను. చూచితిరా! నగ లెంతటి విపత్తును దెచ్చెనో స్త్రీవిద్యవలన నెంతలాభమువచ్చెనో"

ఈవిధముగా సీతమ్మ తన కథను చెప్పినతరువాత ముఖ్యప్రాణరావు తనకథను జెప్పుచుండెను. అందు చదువరులకుఁ దెలిసిన భాగమును వదలి మిగిలిన భాగము మాత్రమే ముఖ్యప్రాణరావు చెప్పినది చెప్పినట్లు వ్రాయుచున్నాను.

“అట్లు తస్కరులచేఁ జావ మోదఁబడినవాఁడనై యీ మహారణ్యమధ్యంబున నొడలు తెలియక పడితిని. నేను తెప్పిరిలి మరల చూచువరకు సీతమ్మ కానరాలేదు. బండి మాయమై పోయినది. ఇది యేమియని నేను హాహా రావంబులుసేయుచు నా యడవిలో నిందందు వెదక నారంభించితినిగాని నేనందులకై పడిన శ్రమయంతయు నడవిని గాసిన వెన్నెలయేయాయెను. ఆ బండివాఁడు మోసముచేసి దాని నెత్తికొని పోయెనో, లేక దొ ... యిరో, ఆమె బ్రతికియుండెనో లేక చచ్చినదో
... ను. అట్లు డోలాయమానసుండనై అపారవిచార
... సన్యాసినై దేశసంచారము చేయుచుంటిని.
... ము నాకుఁ దొరికినది. మా అత్తమామల
... మమును వదలి నేను మరల గృహస్థా

అని చెప్పెను. ఆవెనుక లక్ష్మీదేవమ్మ చనుదెంచి తనసంగతి నిట్లు చెప్ప దొడఁగెను.

“ నామగని యందలి భక్తిచే నే నాయన బట్టలను చక్కఁగా నుతుకుచుంటిఁ గాని లోతునీటికిఁ బోవుచున్న బిందెను గానవైతిని. అవెనుక నేను బిందెకొఱకై చూచువరకది లోతునీళ్ళలో నుండెను. నేను వెనుకకు జంకక తిన్నగా ధైర్యముతోను, సాహసముతోను పేరాశతోను, ముందుఁ బోతిని. పోయి, పోయి తుదకొక లోతగు స్థలమునందు గుభాలున కూలితిని. నన్ను పైకెత్తియుటకు గోదావరిగట్టున నెవ్వరును లేరు. నేను మునుగుచుఁ దేలుచు, బుడగలు వేయుచుంటిని గాని నన్ను కాపాడునంతటి మహాత్ము లెవ్వరును నాకు గోచరముకాలేదు. ఇట్లు ప్రవాహపు వడిచేఁ గొంతదూరము కొట్టుకొనిపోయిన తరువాత భగవదనుగ్రహమువలన నాకొక పెద్ద దూలము దొరకెను. ఆ దూలమును బట్టుకొని నేను ప్రవాహ మెటు గొనిపోయిన నటు బోవుచుఁ బోనుపోను నాచేతియందలికఱ్ఱ త్రోవలో నెక్కడను జిక్కుకొనక తిన్నగాఁ దీసికొనిపోయి కోరంగిలో విడచెను. నేనును నక్కడ కఱ్ఱ పట్టునువదలి తిన్నగా నొడ్డుచేరి యచ్చట స్పృహలేక పడియుంటిని. అంతటయెవ్వరో ధర్మాత్ముఁ డొకఁడు నన్ను తన యింటికిఁ గొనిపోయి నా కౌషధముల నిప్పించి, నా వెంట కాశీపట్టణమునకు రమ్ము. అక్కడనుండి నేను రాజమహేంద్రమునకు నిన్నుఁ దీసికొనివచ్చెదను మాయింట వంటసేయువా రెవ్వరును లేరు ” అనెను. నేనందుల కీయకొనకపోవుటచే నతఁడు నామీదఁ గోపించి తన యాస్థిలో నొక సగము దానిని తన మిత్రులయింటఁ డాచి నే నపహరించితినని నామీఁద నొక యభియోగముఁ దెచ్చెను. అది తప్పుడుసాక్ష్యులచేఁ జక్కఁగా ఋజువుపడినందున, రాజు నన్ను నన్యప్రదేశములకుఁ బంపివేయ నుత్తరువిచ్చెను. ఆ మఱునాఁడు నాపై యోగముఁ దెచ్చిన యాబ్రాహ్మణుఁడు తన మిత్రులను దన ధనమడుగఁగా వారీయమనిరి. అన్యాయముచే నన్ను జెఱిపినందులకు వానికిఁ దగిన శిక్ష అయినది. నన్ను అన్యదేశములకంపిన మఱునాడే రాజా సాక్షులు చెప్పినది ... తెలిసికొని నాపై

విధించిన దండన దీసివేసి నాకుఁ గబురుఁ బంపెను ... ను. ఆ తప్పుడు

సాక్షులను దేశమునుండి వెడలఁగొట్టిరి. నా

రించుచు నేడే యీయూరువచ్చితిని.

జూచితిని. ” ఇట్లామె ముగించినతరువా.

వరమున దుస్సాంగత్యముచేఁ జెడిన ॰

,అయ్యలారా! అట్లు రాజమహేంద్రవరమునుండి పారివచ్చి విశాఖపట్టణ
' నొకరియింట నాలుగువేల రూపాయల ఆస్తిని కన్నము వేసితిని. అంతట వారు
c బట్టుకొని న్యాయాధికారియు నన్ను విచారణచేసి నాలుగు సంవత్సరములు
వేసెను. కారాగృహమునుండి తప్పించుకొని పారిపోయి నీచమైన దొంగతన
రోసి బరంపురముచేరి యందు సంస్కృతాంధ్రభాషలను, ఓషధ్రమును నేర్చుకొని
ప్పను విశాఖపట్టణములోc దెలియcజేసి క్షమార్పణcగోరుటకై బయలుదేరినాను.
ఏ నిక్కడ బసచేసి ఉరియనుటచే నది చూడవలెనని వచ్చి నా తల్లిదండ్రులను
ిని. తమ రనుగ్రహించి నాతప్పులను మన్నించి విశాఖపట్టణములో నాకు
ాకుండc జేయవలెను.''

ఆమాటలను విన్న వెనుక సభవారు మిగుల సంతోషముతో రామారావును
ండని కేకలువేయcజొచ్చిరి. వెంటనే విజయనగరం మహారాజుగారు విశాఖ
ం రాజుగారి కొక యుత్తరము వ్రాయcబోవుచుండెను. అంతలో విశాఖ
ం రాజుగారు వచ్చినారని యొక కబురువచ్చెను. వెంటనే విజయనగర
జుగారును కటకం మహారాజుగారును ఆయన కెదురుగాcబోయి కొనివచ్చి
నమునసుంచి రామారావు సంగతి నివేదించిరి. విశాఖపట్టణం రాజుగారును
సంతసించి యతనిని క్షమించుటయేకాక తన యాస్థానమున నొక మంత్రిత్వ
గెను. ఆవెనుక త్రివిక్రముండు లేచి "మహాజనులారా! మాకథలను గ్రహించి
కెలివితక్కువగా ప్రవర్తించువారి కసటులను విద్యయొక్క మాహాత్మ్యమును
యొక్క యుపయోగమును, దొంగతనము, అబద్ధపుసాక్ష్యము మొదలగు
వచ్చు నష్టములను నిట్టి నీతు లనేకములను దెలియవచ్చును. కావున నెన్నc
స్కార్యముల నొనర్పక తగునట్లు వర్తింపుcడు. అని యనేకవిధముల నెల్లర
ంచెను. ఇంతలో సీతమ్మ తాళ్ళవలసవద్దనున్న దొంగలనుబట్టుcడని యానవాళ్లు
ఆవిధముగా నాదొంగలు పట్టcబడి శిక్షింపcబడిరి. త్రివిక్రమునికి విజయ
లోc ప్రధాన మంత్రిత్వ మీయcబడెను. విజయనగరములోని పూర్వపు మంత్రి
ఈ వివాహములలో పాత్రాపాత్రవిచారముతో మఱి
ను మొదలగునవి లేవు. వెంకటేశ్వరునికి విజయనగర
ను. రామారావు విశాఖపట్టణములో నొక
పూర్వము కన్నము వేసినయింటియాయన
ావును కటకములో మంత్రిగానుండుమని
చినందున నాతc డంమల కియ్యకొనెను.

వెనుక సింహాచలములో వీరిరువురికిఁ జరిగిన వివాహము వివాహము గాదని యెుదుట మరల సీతమ్మ ముఖ్యప్రాణరావులకు వివాహముజరుప నిశ్చయి విక్రమసేనమహారాజు తన కుమారుని వివాహముతో నీవివాహముల నన్నింటిని నిశ్చయించి తన యభిప్రాయమును వెల్లడిసేయఁగా నందరు నైక్యకంఠముతోఁ కంగీకరించిరి. అంతట వీరందరును కటకమునకుఁబోయిరి. అట మానసారునికిని దేశపు రాజకుమార్తెకును, త్రివిక్రమునికిని విజయనగరము ప్రధానమంత్రి కు కును ముఖ్యప్రాణరావునకును సీతమ్మకును, రామారావునకును, కోటీశ్వరుల రావుగారి కుమార్తెకును వివాహములు జరిగెను. ఈవివాహమునకు రాజమ వరమునుండి సూరి విశ్వనాథశాస్త్రులవారు మొదలగువారువచ్చి తమ కు గాంచి సంతసించిరి. కాశీదేశపురాజును త్రివిక్రమునిఁ దన రాష్ట్రములో ను బ్రతిమాలెనుకాని, యందులకు విజయనగరము మహారాజుగారు సమ్మతించలే మహావైభవముతో నీ నాలుగువివాహములునైన వెనుక నందరును తమతమ ర లకువచ్చి తమతమ యుద్యోగములలోఁ బ్రవేశించి మెలకువతో మసలుచు శాంచిరి. సుఖంబుండిరి.

సంపూర్ణము.
